అందుబాటులోకి ప్రాంతీయ ఫోరెన్సిక్ ప్రయోగశాల: సీపీ

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రాంతీయ న్యాయ వైజ్ఞానిక శాస్త్ర ప్రయోగశాల (రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ) ఖమ్మం కమిషనరేట్‌లో అందుబాటులోకి వచ్చిందని సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఇది నేర న్యాయ వ్యవస్థ నిర్వహణలో విశ్వసనీయమైన శాస్త్రీయ సేవలను అందిస్తుందన్నారు. శాస్త్రీయ పరిశోధన రంగంలో స్థిరమైన పురోగతి సాధిస్తున్న లాబొరేటరీని ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు అందుబాటులో ఉండే విధంగా జూబ్లీపుర పాత డీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. హత్య, మానభంగం, దోపిడీ కేసుల్లో, అనుమానాస్పద పరిస్థితుల్లో మరణాలకు గల కారణాలను తెలుసుకోవడం నేర దర్యాప్తులో అతి ముఖ్యమైన అంశమని వివరించారు. ఇటువంటి కేసుల్లో శవాన్ని వైద్యాధికారి పరీక్షించి, కడుపులో భాగాలు, రక్తం, మెదడు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి శరీర భాగాలను గతంలో వరంగల్ ల్యాబ్‌కు పంపేవారని, ఇప్పుడు ఖమ్మంలోనే పరీక్షిస్తారన్నారు.

..ఐతే మాకేంటి?

● ఈజీఎస్ బిల్లులకు అనుమతి పత్రం జారీ చేసేందుకు ఆమ్యామ్యాలు..!

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో ఏసీబీ దాడులు జరిగి ఏడాది కూడా పూర్తికాలేదు. అయినా ఈ కార్యాలయంలో కొందరు ఉద్యోగుల తీరు మారలేదని, ఎప్పటి మాదిరిగానే ఆమ్యామ్యాలకు చేతులు చాస్తున్నారని, ఇవ్వకుంటే దస్త్రాలను తొక్కిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాకు రూ.11 కోట్లు విడుదల

జడ్పీ కార్యాలయ ఆవరణలోని పీఆర్ ఇంజినీరింగ్ డివిజన్ కార్యాలయం నాలుగు రోజులుగా రద్దీగా మారింది. ఏడాది క్రితం ఉపాధి హామీ పథకంలో నిర్మించిన సీసీ రోడ్లకు సంబంధించిన బిల్లులు సుమారు రూ.11 కోట్లు జిల్లాకు విడుదలయ్యాయి. ఇందులో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర నియోజకవర్గాలకు రూ.7 కోట్లు, సత్తుపల్లి నియోజకవర్గానికి రూ.4 కోట్లు ఉన్నాయి. సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు పూర్తవగా అప్పట్లోనే ఎంబీలు రికార్డు చేసి, బిల్లులు ఆన్‌లైన్‌లో నిక్షిప్తపరిచారు. ఈ పనులను నాడు ఆయా గ్రామాల్లో సర్పంచులు చేశారు. ఇప్పుడొచ్చిన



నిధులను పంచాయతీ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి సంయుక్త బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. అయితే నిధులను డ్రా చేసేందుకు పీఆర్ డివిజన్ కార్యాలయంలో ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)ను ప్రతి పనికి జారీ చేయాల్సి ఉంటుంది. ఈ అనుమతి పత్రం ఆధారంగా పంచాయతీ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి తమ ఖాతా నుంచి డబ్బు చెల్లించేందుకు చెక్కు జారీ చేస్తారు. ఉపాధి హామీ పథకంలో ఈ పనులు జరిగాయి. వీటికి సంబంధించిన బిల్లులను ప్రస్తుతం 75-80 శాతం మాత్రమే ఇస్తున్నారు. ఎఫ్‌టీఓ జారీకి కార్యాలయంలోని సంబంధిత సెక్షన్లలో పనిచేసే కొందరు ఉద్యోగులు సంబంధిత బిల్లు మొత్తంలో 1-2 శాతం తమకు ఆమ్యామ్యాలు ముందుగా ఇవ్వాల్సిందేనని పట్టుపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా వచ్చిన డబ్బులో పలువురికి వాటాలు ఉంటాయని చెబుతున్నారని సమాచారం. అసలే పనిచేసిన ఏడాది కాలం తర్వాత ప్రభుత్వం నిధులు విడుదల చేయగా కొందరు ఉద్యోగులు తమను ఇబ్బంది పెడుతున్నారని పనులు చేసిన వారు వాపోతున్నారు.

★ ఉపాధి హామీ పథకంలో గత మార్చి 7 వరకు పూర్తిచేసిన పనులకు సంబంధించి జిల్లాకు రూ. 11 కోట్లు విడుదలయ్యాయి. పనులు చేసిన వారికి ఎఫ్‌టీఓను వెంటనే ఇస్తున్నాం. తమ కార్యాలయంలో ఉద్యోగులు డబ్బులు వసూలు చేస్తున్నారనేది నిజం కాదు. శుక్రవారం నాటికి 95 శాతానికిపైగా అనుమతి పత్రాలు జారీ చేశాం.

- వెంకటరెడ్డి, పీఆర్ ఈఈ, ఖమ్మం

'అక్రమ కేసులతో లొంగదీసుకునే యత్నం'




మాట్లాడుతున్న తాతా మధుసూదన్, చిత్రంలో సండ్ర వెంకటవీరయ్య, కమల్‌రాజు తదితరులు

ఖమ్మం కార్పొరేషన్: భారాస నేతలపై అక్రమ కేసులు పెట్టి, లొంగదీసుకునేందుకు యత్నిస్తే మూల్యం తప్పదని, ఈ విషయంలో పోలీసులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఎమ్మెల్సీ, భారాస జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. చింతకాని మండల భారాస అధ్యక్షుడు పుల్లయ్యపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని ఖండించారు. ప్రమాదవశాత్తు బోజెడ్ల ప్రభాకర్ మరణిస్తే, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోలేదని విమర్శించారు. కేసీఆర్ వెంట ఉంటే కేసులేనన్న భయాన్ని కల్పించేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. పగడాల నాగరాజు, పుల్లయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి దైవంతో సమానం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సమావేశంలో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీజ, సీపీ సునీల్‌దత్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ప్రకృతి దైవంతో సమానమని, పర్యావరణాన్ని సంరక్షించటం అందరి బాధ్యత అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. జిల్లా అధికారులు, ప్రముఖులు, కళాకారులు, రచయితలు, క్రీడాకారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశ్రీ వనజీవి రామయ్య మాదిరిగా తానూ పర్యావరణవేత్తగా తొలుత ప్రపంచానికి పరిచయమయ్యానని గుర్తుచేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులకు అందాలని అభిలషించారు. ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటు చేయటం అభినందనీయమని, భద్రాద్రి జిల్లా మాదిరిగా ఇక్కడా ఔషధ మొక్కలు పెంచాలని సూచించారు. సార్నాథ్ మాదిరిగా నేలకొండపల్లిలో బౌద్ధస్తూపం వెలుగొందాలని, పర్యాటకుల సంఖ్య పెరగాలని ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లాలో వరదల సమయంలో చేపట్టిన పునరావాస చర్యలను కొనియాడారు. బాధితులకు పరిహారం అందించటం, వరదల్లో ప్రమాదాల్లో కోల్పోయిన వారికి ఆర్థిక సాయం అందించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని గవర్నర్‌ను ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో డెంగీ, అనీమియా కేసులు అధికంగా నమోదయ్యాయని, మూడేళ్లగా తగ్గుముఖం పట్టాయన్నారు. అంతకుముందు జిల్లా ప్రాముఖ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏదులాపురం మండలంలో 20వేల మంది మహిళలతో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర, సీనియర్ స్టేజ్ ఆర్టిస్ట్ పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, కాళోజీ అవార్డు గ్రహీత, కవి డాక్టర్ సీతారామ్, అంతర్జాతీయ క్రీడాకారిణి పవిత్రాచారి, సెయిలర్ అఖిల్, కవులు ప్రసేన్, మువ్వా శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఆయా రంగాల్లో అందిస్తున్న సేవలను వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ, సీపీ సునీల్‌దత్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, శిక్షణ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఈఓ సోమశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

వంటకాలను రుచి చూసి..

కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన, స్టాల్స్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. పర్యాటక ప్రదేశాలు ఖమ్మం ఖిల్లా, జాఫర్ బావి, లకారం ట్యాంక్‌బండ్, తీగల వంతెన, వైరా, పాలేరు రిజర్వాయర్లు, నేలకొండపల్లి మండలం బౌద్ధస్తూపం, జమలాపురంలో వెంకటేశ్వరస్వామి ఆలయం, కూసుమంచిలో శివాలయం, కల్లూరు మండలంలో కనిగిరి గుట్టల ప్రాశస్త్యాన్ని కలెక్టర్ వివరించారు. వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో పంట రుణమాఫీ, ఆయిల్‌పామ్ మొక్కల పెంపకం తదితర అంశాలను గవర్నర్ పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వంటకాలను రుచి చూశారు. గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.



విద్యాశాఖ స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్, చిత్రంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్



హాజరైన కవులు, కళాకారులు, సామాజిక సేవకులు

కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో కుడా ఆవిర్భావం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, పరిసర గ్రామాలతో 'కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)'ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన జీవో నంబరు 177ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ శుక్రవారం జారీ చేశారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల సమగ్ర అభివృద్ధి కోరుతూ పలుమార్లు చేసిన విజ్ఞప్తులతో ఈ నిర్ణయాన్ని సర్కారు వెలువరించింది. జంట పట్టణాలతో పాటు భద్రాద్రి జిల్లా కేంద్రానికి ముఖద్వారంగా చెప్పుకొనే సుజాతనగర్ (గ్రామీణ) అర్బన్ అథారిటీ పరిధిలోకి చేర్చడం విశేషం. 'కుడా' ఏర్పాటుపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పందించారు. ఉత్తర్వుల ప్రతులను ఆయన విలేకరులకు అందజేశారు. 'కుడా' ఏర్పాటు సంతోషదాయకం. ఇక జంట పట్టణాలు, నియోజకవర్గం అనతికాలంలోనే ఊహించని విధంగా అభివృద్ధిని సాధిస్తాయి. పారిశ్రామికంగా మరింత పురోగతిని సాధించడం చూడవచ్చు. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. పలుమార్లు చేసిన అభ్యర్థనతో స్పందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అని కూనంనేని అన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ అయిన ఖమ్మం జిల్లా VDO's కాలనీ, ఖానాపురం హవేలి, ఖమ్మం నగరం మరియు అర్బన్ మండలంనకు చెందినటువంటి శ్రీరామ మాధవ సుబ్రహ్మణ్యేశ్వరరావు, S/o వెంకట రామానుజయ్య అనువారు ఈ దిగువ తెలుపబడిన షెడ్యూలు దాఖలా ఆస్తి అనగా ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం, కోనాయిగూడెం రెవెన్యూ పరిధిలోని S.No. 63/ఆ1/అ1/1/1 extent Ac. 0.24 gts విస్తీర్ణం కలిగి ఉన్న వ్యవసాయ భూమిని లేటు వడ్డె లక్ష్మీపార్వతి, W/o భాస్కర్‌రావు గార్ల వారసురాలైన మాసారపు వేదశ్రీ, W/o రామకృష్ణ మరియు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం, కోనాయిగూడెం రెవిన్యూ పరిధిలోని S.No. 63/ఆ1/అ/1/2 extent Ac. 0.23 1/2 gts విస్తీర్ణం కలిగి ఉన్న వ్యవసాయ భూమి లేటు వడ్డె లక్ష్మీపార్వతి, W/o భాస్కర్‌రావు గార్ల రెండవ వారసురాలైన వడ్డె శివాని, W/o భాస్కరరావు అను వారి నుండి మరియు ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం, బోదులబండ రెవెన్యూ పరిధిలోని S.No.341 మింజుమలై Ac.01 Gts 121.00 చ॥గ॥లు గల స్థిరాస్తిని మాలోని నెం.2 వారు దారి నిమిత్తమై SK.తాజుద్దీన్ గారి నుండి క్రయం పొంది ఉన్నారు. అట్టి స్థిరాస్తి విక్రయ అగ్రిమెంట్ ఆధారంగా నా క్లయింట్ సదరు భూమిపై పట్టా హక్కులు పొంది ఉన్నారు. కావున సదరు స్థిరాస్తికి వడ్డె లక్ష్మీపార్వతి, W/o భాస్కర్‌రావు గారు పట్టా హక్కులు కలిగి ఉండి వారి తదనంతరము పైన తెలిపిన వారు వారసులుగా సదరు ఆస్తిని సర్వహక్కులు సంక్రమింపబడి ఉన్నవని మరియు వారి కుటుంబ అవసరాల నిమిత్తమై నా క్లయింట్ అయిన శ్రీరామ మాధవ సుబ్రహ్మణ్యేశ్వరరావు, S/o వెంకట రామానుజయ్య అను వారికి పైన తెలిపిన స్థిరాస్తి విక్రయం అగ్రిమెంట్ ద్వారా క్రయపరుచుట జరిగినది. అట్టి స్థిరాస్తి క్రయ అగ్రిమెంట్‌పై ఎవరికి ఏ విధమైన అభ్యంతరములు మరియు ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ఇచ్చిన తేది నుండి 7 రోజులలోపు వారి అభ్యంతరములను రాత పూర్వకంగా ఈ క్రింద తెలుపబడిన చిరునామాకు ఇవ్వగలరని తెలుపుచున్నాను. ఒకవేళ సదరు నిర్ణయించిన కాల పరిమితిలో ఎవరి దగ్గర నుండి అయిన ఎటువంటి అభ్యంతరములు రానియెడల సదరు ఆస్తిని నా క్లయింట్ అయిన శ్రీరామ మాధవ సుబ్రహ్మణ్యేశ్వరరావు, S/o వెంకట రామానుజయ్య అను వారికి సర్వహక్కులు ఉండబడునని భావించవలసి వస్తుంది.

సం/- మార్కపూడి కన్నాంబ MA, LLM
చుండూరు కోటేశ్వరరావు B.Sc., LLB చుండూరు దీప్తి BBA, LLB
అడ్వకేట్స్, ఖమ్మం. సెల్: 9502132806, 9347110315
అడ్రసు: RTC కాలనీ, జలగం నగర్, పెద్దతండా, ఖమ్మం రూరల్, ఖమ్మం.

ధాన్యం సేకరణకు కసరత్తు ముమ్మరం



ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

వానాకాలం ధాన్యం సేకరణకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ముందస్తుగా ప్రకటించటంతో సన్నాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 4,45,703 ఎకరాల్లో వరి పంట సాగవగా ఇందులో 4,17,681 (93.71శాతం) ఎకరాల్లో సన్నాలే కావటం గమనార్హం. 483 కొనుగోలు కేంద్రాల ద్వారా 7.18లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. గన్నీ సంచులు, టార్పాలిన్ పట్టాలను ఆయా కేంద్రాలకు తరలిస్తున్నారు. కనీస మద్దతు ధర క్వింటాకు ఏ-గ్రేడ్ రకానికి రూ. 2,320, సాధారణ రకానికి రూ. 2,300 ప్రభుత్వం చెల్లించనుంది. ఖమ్మం జిల్లాలో వరి కోతలు మొదలైనచోట్ల 34 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తుండగా.. భద్రాద్రి జిల్లాలో కోతలు మొదలవలేదు.

ప్రత్యేక యంత్రాలు.. తీరొక్క రంగులు

బోనస్ వర్తించే 33 రకాల సన్నాలను ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. వీటి గుర్తింపునకు 'ప్యాడి హస్కల్', 'గ్రెయిన్ కాలిపర్' యంత్రాలను అధికారులు ఉపయోగించనున్నారు. మొదటగా గుప్పెడు వడ్లను తీసుకుని 'ప్యాడి హస్కల్'లో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకొస్తాయి. 'గ్రెయిన్ కాలిపర్' ద్వారా ఇవి సన్నాలో కాదో తెలుసుకోవచ్చు. సన్నవడ్ల బస్తాలను ఎరుపు రంగు, దొడ్డు రకాలను ఆకుపచ్చ రంగుతో కోడ్ చేయనున్నారు.

వరి కోతలు మొదలైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే 34 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నాం. సన్న రకాల సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

- చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి, ఖమ్మం



	వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	కొనుగోలు కేంద్రాలు	ధాన్యం సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో)
ఖమ్మం	2,82,014	323	4.26 లక్షలు
భద్రాద్రి	1,63,689	160	2.92 లక్షలు

సర్కారు గుర్తించిన సన్నరకం వంగడాలు..

- సాంబమసూరి (బీపీటీ-5204)
- హెచ్ఎంటీ సోనా
- కూనారం వరి (కేఎన్ఎం-1638)
- కూనారం వరి-1 (కేఎన్ఎం-733)
- జగిత్యాల మసూరి (జేజీఎల్-11470)
- జగిత్యాల వరి-2 (జేజీఎల్-28545)
- జగిత్యాల వరి-3 (జేజీఎల్-27356)
- మానేరు సోనా (జేజీఎల్-3828)
- జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798)
- జగిత్యాల సాంబ (జేజీఎల్-3844)
- జగిత్యాల సాంబ (జేజీఎల్-3855)
- పొలాస ప్రభ (జేజేఎల్-384)
- కరీంనగర్ సాంబ (జేజీఎల్-3855)
- అంజన (జేజీఎల్-11118)
- ప్రత్యుమ్న (జేజీఎల్-17004)
- జేజీఎల్-33124(పీఆర్సీ)
- తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048)
- ఆర్ఎన్ఆర్-31379 (పీఆర్సీ)
- కృష్ణ (ఆర్ఎన్ఆర్-2458)
- సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్-2465)
- శోభిని (ఆర్ఎన్ఆర్-2354)
- రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్-21278)
- వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్-14)
- వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్-32100)
- వరంగల్ వరి-1119
- వరంగల్ వరి-2 (డబ్ల్యూజీఎల్-962)
- సోమనాథ్ (డబ్ల్యూజీఎల్-347)
- కేపీఎస్-6251 (పీఆర్సీ)
- ఎంటీయూ-1271
- నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్-34449)
- మార్టేరు సాంబ (ఎంటీయూ-1224)
- మార్టేరు మసూరి (ఎంటీయూ-1262)
- సిద్ధి (డబ్ల్యూజీఎల్-44)

రేపు ఉప ముఖ్యమంత్రి పర్యటన

ఖమ్మం కమాన్‌బజార్ న్యూస్‌టుడే: జిల్లాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 8.45గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 10 గంటలకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కలెక్టరేట్ బ్రాంచిని, శ్రీశక్తి క్యాంటీన్, బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత మధిర నియోజకవర్గంలో బోనకల్లు మండలం తూటికుంట్ల చేరుకుని 11.15గంటలకు రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బ్రహ్మణపల్లి, కలకోటలో బీటీ రహదారుల పనులను ప్రారంభిస్తారు. చిరునోముల, చిర్రుమర్రి, ముదిగొండ, వెంకటాపురం, ఎడవల్లి, మాధాపురం గ్రామాల్లో రహదారుల పనులకు మధ్యాహ్నం శంకుస్థాపన చేస్తారు.

ప్రధాన తపాలా కార్యాలయానికి సౌర వెలుగులు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: నగరం, స్టేషన్‌రోడ్డులో గల ప్రధాన తపాలా కార్యాలయానికి సౌర వెలుగులు రానున్నాయి. రూ.10 లక్షల అంచనాలతో సౌర విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇందుకు భవనం అనువుగా ఉందా అనే అంశాన్ని తెలుసుకునేందుకు శుక్రవారం పరిశీలించారు. తపాలా అధికారి వీరభద్రస్వామితో కాంట్రాక్ట్ ఏజెన్సీ సభ్యులు చర్చించారు. ఆయన సమక్షంలోనే కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే సౌర వ్యవస్థ ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఉద్యోగులు చెప్పారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్

హెడ్ ఆఫీస్ : వరంగల్ - ప్రాంతీయ కార్యాలయం : ఖమ్మం
ముదిగొండ బ్రాంచి-4152, ఖమ్మం జిల్లా-507158.

సంక్షిప్త డిమాండ్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ముదిగొండ బ్రాంచి-4152 నుండి ఈ దిగువ రుణగ్రహీత/లు: 1) శ్రీ నాదెండ్ల నరసింహారావు, తండ్రి: జనార్ధనరావు, 2) శ్రీమతి నాదెండ్ల సునీత, భర్త: నరసింహారావు వార్లు పొందిన రుణసౌకర్యాలకు సంబంధించిన వారు పొందిన రుణసౌకర్యాలకు సంబంధించిన Housing Loan A/c. No. 73150641553, KCC Loan A/c No. 73204448018 అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, మీ రుణఖాతాలు నిరర్ధక ఖాతాలు (NPA)గా వర్గీకరించబడినవని, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము బ్యాంకుకు చివరిగా తెలిసిన మీ చిరునామాలకు నోటీసులు జారీచేయడమైనది, కానీ అవి బట్వాడా కాకుండా తిరిగి వచ్చినవి. అందువలన ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత/లు & హామీదారుల యొక్క పేరు: 1) శ్రీ నాదెండ్ల నరసింహారావు, తండ్రి: జనార్ధనరావు, ఇంటి నెం.11-2-180/1, గాంధీనగర్, పాల్వంచ, భద్రాద్రికొత్తగూడెం - 507115. ఇక్కడ కూడా: ఇంటి నెం.1-8-90/1, ఆర్‌యస్ నగర్, వార్త ఆఫీస్ ఎదురు, పెద్దతండా, ఖమ్మం-507003. 2) శ్రీమతి నాదెండ్ల సునీత, భర్త: నరసింహారావు, ఇంటి నెం.11-2-180/1, గాంధీనగర్, పాల్వంచ, భద్రాద్రికొత్తగూడెం - 507115. ఇక్కడ కూడా: ఇంటి నెం.1-8-90/1, ఆర్‌యస్ నగర్, వార్త ఆఫీస్ ఎదురు, పెద్దతండా, ఖమ్మం-507003. మరియు హామీదారు: హౌసింగ్ లోన్ హామీదారు: శ్రీ నాదెండ్ల కృష్ణ ప్రసాద్, తండ్రి: నరసింహారావు, ఇంటి నెం.8-2-218, గట్టాయిగూడెం, పాల్వంచ, భద్రాద్రికొత్తగూడెం - 507115. కెసిసి లోన్ హామీదారు: శ్రీ జక్కి యాకయ్య, తండ్రి: నర్సయ్య, ఇంటి నెం.1-80, మల్లారం, ముదిగొండ, ఖమ్మం జిల్లా - 507169.

డిమాండ్ నోటీసు తేది : 23-10-2024	NPA యొక్క తేది : 27.05.2024

చెల్లించవలసిన బకాయి మొత్తము : ది.23-10-2024 నాటికి రూ.25,23,410/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల ఇరవై మూడు వేల నాలుగు వందల పది రూపాయలు మాత్రమే) + ది.24-10-2024 నాటికి వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మొ॥

అమలుచేయవలసిన సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరాలు / ఆస్తుల వివరాలు: (డాక్యుమెంట్ నెం.9798/2018, తేది.12-12-2018 ప్రకారము శ్రీ నాదెండ్ల నరసింహారావు, తండ్రి: జనార్ధనరావు పేరునగల ఆస్తి.) ఖమ్మం జిల్లా రిజిస్ట్రార్ మరియు ఖమ్మం రూరల్ సబ్-రిజిస్ట్రార్, పెద తండా రెవెన్యూ మరియు గ్రామపంచాయతీ, సర్వే నెం.182/ఈ3 నందు 200.0 చ॥గ॥ = 167.22 చ॥మీ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.7 స్థలమునకు సంబంధించిన యావదాస్తి ఈ దిగువ హద్దులలో: తూర్పు: ప్లాట్ నెం.19; పడమర: 30 అ॥ వెడల్పుగల రోడ్డు; ఉత్తరం: ప్లాట్ నెం.8; దక్షిణం: ప్లాట్ నెం.6.

పైన పేర్కొన్న రుణగ్రహీత(లు) మరియు / లేదా వారి హామీదారు (లు) ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు బకాయి మొత్తాన్ని చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది. ఒకవేళ ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు ముగిసేలోపు మీరు బకాయి చెల్లించుటలో విఫలమైతే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(4) ప్రకారము నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం తదుపరి చర్యలు తీసుకోబడును.

తేది : 23-10-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ముదిగొండ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్

అధికారుల మెడకు ఉచ్చు

ఈటీవీ, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరపాలికలో అక్రమార్కులకు వంత పాడిన వివిధ విభాగాల సిబ్బందికి నోటీసులివ్వాలని విజిలెన్స్ అధికారులు సిఫార్సు చేయటం సంచలనం రేకెత్తిస్తోంది. బల్దియాలో 2018 నుంచి 2023 వరకు చేపట్టిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపిన విషయం విదితమే. ప్రధానంగా ఎనిమిది మంది జాబితాతో బహిర్గతమైన విజిలెన్స్ నివేదిక.. సంబంధిత సిబ్బందిలో దడ పుట్టిస్తోంది.

ఇదీ అసలు కథ

ఖమ్మం నగరంలో 2018 నుంచి 2023 వరకు రూ.వందలాది కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. ఖమ్మం కార్పొరేషన్‌ను ప్రగతి పథంలో ముందుంచామని గత ఎన్నికల సమయంలో భారాస చెప్పుకొంది. నగరంలో అభివృద్ధి మాటున అవినీతి జరిగిందంటూ అప్పటి ప్రతిపక్ష పార్టీ (కాంగ్రెస్) నేతలు ఆరోపణలు గుప్పించారు. తదనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఖమ్మం నగరంలో తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు తీసుకున్నారని సర్కారుకు ఫిర్యాదులందాయి.



సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణాలు, సుందరీకరణ పేరిట చేపట్టిన పనులు, చేసిన ఖర్చుల వివరాలపై నిగ్గు తేల్చాలని డిమాండ్లు ఊపందుకోవటంతో ఈఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం 'విజిలెన్స్' విచారణకు ఆదేశించింది. 2018 నుంచి 2023 వరకు చేపట్టిన పనులపై సుమారు రెండు మాసాల్లో ఐదు బృందాలు విచారణ జరిపాయి. రూ.50లక్షల పైబడి చేపట్టిన పనుల ప్రతిపాదనలు, నాణ్యత ప్రమాణాలు, ఖర్చులు, బిల్లుల వివరాలు సేకరించాయి. క్షేత్రస్థాయిలో ఆయా పనులను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. 'విజిలెన్స్' విచారణ పూర్తయినా ఆతర్వాత ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోలేదు. తాజాగా ఈనెల 10న నగరపాలక సంస్థలోని ప్రజారోగ్యశాఖకు 'విజిలెన్స్' నివేదిక అందింది.

వారిపై చర్యలు తప్పవా..?

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు కొరవడ్డాయని, ఒకే గుత్తేదారుకు పదేపదే పనులు అప్పగించారని విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. పరోక్షంగా బల్దియా అధికారుల ఉదాసీనతే కారణమని తేల్చారు. సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలనే 'విజిలెన్స్' సిఫార్సు మేరకు ఎనిమిది మందికి ప్రజారోగ్యశాఖ ద్వారా నోటీసులు జారీ అయ్యాయి. నోటీసులు అందుకున్న వారిలో ముగ్గురు ఏఈలు, నలుగురు డీఈలు, ఒక ఈఈ ఉన్నారు. వీరి వివరణలు సంతృప్తికరంగా లేకపోతే చర్యలు తప్పవనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. సదరు గుత్తేదారుకు రూ. 21 లక్షల జరిమానా విధించాలని, భవిష్యత్తులో ఎలాంటి పనులు అప్పగించొద్దని విజిలెన్స్ అధికారులు సిఫార్సు చేసినట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమంది సిబ్బంది.. అధికార పార్టీ నాయకుల శరణు కోరుతుండటంతో ఇప్పుడు ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై ప్రజారోగ్యశాఖ ద్వారా పలువురు సిబ్బందికి నోటీసులు అందించినట్లు సమాచారముందని నగరపాలక కమిషనర్ అభిషేక్ అగస్త్య 'ఈనాడు'కు తెలిపారు. సంబంధిత అధికారుల వివరణల తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గురువుల 'చేతిలో' విద్యార్థుల ఆరోగ్యం..

పెనుబల్లి, న్యూస్‌టుడే

బాలబాలికల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్

విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే చదువుకోగలుగుతారు. అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. సహజంగా బాలబాలికల్లో శారీరక, మానసిక సమస్యలుంటాయి. కొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులే విద్యార్థుల్లో ఆరోగ్యపరమైన లోపాలను గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో 'ప్రశస్త్' పేరుతో ప్రత్యేక యాప్ రూపొందించింది.



పెనుబల్లి మండల వనరుల కేంద్రంలో శిక్షణ కార్యక్రమంలో ప్రశస్త్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్న ఉపాధ్యాయులు

21 రకాల లోపాలు గుర్తింపునకు..

విద్యార్థుల్లో చదవడం, వినడం, మాట్లాడటంలో ఇబ్బందితోపాటు చెప్పిన పదాన్ని పదేపదే చెప్పమనడం, రోజువారీ పనులు సొంతంగా చేసుకోలేకపోవడం, అనుమతి లేకుండా తరగతి నుంచి వెళ్లడం, నెమ్మదిగా చదవడం, రాయడం, స్పష్టత లేని చేతిరాత, రివర్స్‌గా రాయడం, గణిత చిహ్నాలు అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, పునరావృత ప్రదర్శనలో ఇబ్బందులు, ఆసక్తిగా లేకపోవడం, చెప్పిందే చెబుతూ ప్రతిస్పందించడం, విచారంగా కనిపించటం, ఇతర విద్యార్థులతో పోలిస్తే సులభంగా అలసిపోవడం తదితర 21 రకాల లోపాల్లో దేనితో ఇబ్బంది పడుతున్నారో ఉపాధ్యాయులు తమ ప్రత్యక్ష పరిశీలనతో నమోదు చేస్తారు.

రెండు విభాగాలుగా..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను నమోదు చేసే ప్రశస్త్ యాప్‌ను రెండు భాగాలుగా విభజించారు. కొన్ని ప్రశ్నలు ఉపాధ్యాయులడిగి తెలుసుకోవాలి. మరికొన్నింటిని వారే నిశితంగా పరిశీలించి నమోదు చేయాలి. యాప్‌లో 63 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపర్చాలి. పార్ట్-1లో లోపాలు గుర్తిస్తే, పార్ట్-2లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల లోపాలను ఉపాధ్యాయులు పరిశీలించి నిర్ధారించి వైద్యులకు సిఫార్సు చేస్తారు.

ఇదీ ఉద్దేశం

ప్రభుత్వ విద్యాలయాల్లో 0-18 ఏళ్లలోపు వారి వైకల్యాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారికి అవసరమైన చికిత్స, సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో 'ప్రశస్త్' తెరపైకి తెచ్చారు. ఉపాధ్యాయుల సాయంతో వైకల్యాలున్న పిల్లలను గుర్తించి సమగ్ర విద్యను అందించడం ముఖ్య ఉద్దేశం.

ఉపాధ్యాయులు చేయాల్సిందిదీ..

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రశస్త్ యాప్‌ను తమ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఉపాధ్యాయుని పేరు, ట్రెజరీ ఐడీ, మెయిల్ ఐడీ, సెల్ నంబర్, యూడైస్ కోడ్‌తో లాగిన్ కావాలి. అనంతరం యాప్‌లో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

ఉమ్మడి ఖమ్మం

మొత్తం పాఠశాలలు, కళాశాలలు: 2077

సిబ్బంది: 3,821 మంది ఉపాధ్యాయులు, 48 మంది ప్రత్యేక విద్యా బోధకులు.

ఇప్పటివరకు (ఈ నెల 21 వరకు) నమోదైన విద్యార్థులు: 8044

నమోదు చేశాక...

'ప్రశస్త్' ద్వారా విద్యార్థుల వైకల్యాలను గుర్తించాక.. ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తారు. సమస్యల వివరాలను వారితో చర్చిస్తారు. సంబంధిత వైకల్యం ఆధారంగా వైద్య ధ్రువీకరణ పత్రం(సదరం) కోసం దరఖాస్తు చేయాలి. 40శాతం కంటే ఎక్కువ ఉన్నవారికి ప్రభుత్వపరమైన రాయితీలు పొందేందుకు అర్హత పొందుతారు. పాఠశాల స్థాయిలోనే ప్రత్యేక పరికరాలు, వైద్య సాయం అందేలా చర్యలు తీసుకుంటారు.



తల్లిదండ్రులతో పోల్చితే ఉపాధ్యాయులు విద్యార్థుల లోపాలను సులువుగా గుర్తించే అవకాశముంది. ప్రశస్త్ ద్వారా విద్యార్థుల స్క్రీనింగ్ సాధ్యమవుతుంది. ఉపాధ్యాయులందరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, సాధ్యమైనంత తొందరగా స్క్రీనింగ్ చేయాలి. ఈ నెల 26 వరకు మొదటి దశ పూర్తవుతుంది.

రాజశేఖర్, సహిత విద్య జిల్లా సమన్వయకర్త, సమగ్ర శిక్ష, ఖమ్మం

అతడే.. ఓ సైన్యం!

☆ ఉద్యోగార్థులు, విద్యార్థులకు హేమంత్ ఫిట్‌నెస్ శిక్షణ

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఆయన బీటెక్ పట్టభద్రుడు. ఖాకీ కొలువు సాధించాలనేది కల. అందుకు శారీరక దారుఢ్యం ముఖ్యం. కఠోర శ్రమతో ఫిట్‌నెస్‌పై పట్టు సాధించిన తీరు అద్భుతం. ఆ మెలకువలను తోటి యువతకు నేర్పిస్తూ మైదానంలో మరుగున పడిలేలా ప్రోత్సహిస్తున్నారు. ఆయన తన యువతతో కదిలే సైన్యం.. 'అతడే ఓ సైన్యం' అనిపిస్తుంది.


కొత్తగూడెం శ్రీనగర్‌కాలనీకి చెందిన 26 ఏళ్ల హేమంత్ తండ్రి లోకనాథ్ గ్రామీణ వైద్యుడు. ఆయన 2017లో అనారోగ్యంతో మృతిచెందారు. హేమంత్ తల్లి రమాకుమారి టేకులపల్లి పీహెచ్‌సీలో ఏఎన్ఎం. బీటెక్ పూర్తిచేసిన హేమంత్ పోలీస్ శాఖలో ఎస్సై ఉద్యోగమే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున స్థానిక ప్రగతి మైదానానికి వెళ్లి కసరత్తులు చేస్తుంటారు. శారీరక దారుఢ్య పరీక్షలకు సంబంధించిన పలు అంశాలపై పట్టు సాధించారు. ఇదే క్రమంలో రాత పరీక్షకు ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో తాను నేర్చుకున్న మెలకువలను తోటి యువతకు నేర్పించాలని అనుకున్నారు. పోలీస్, ఆర్మీ, రైల్వే, సింగరేణి సెక్యూరిటీ వంటి ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే వారు మైదానానికి నిత్యం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారంతా హేమంత్ వద్ద శిక్షణ పొందుతున్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, వార్మప్‌లో తాను నేర్చుకున్న మెలకువలను ఆ యువకుడు ఉద్యోగార్థులకు చెబుతున్నారు. మైదానంలో తర్ఫీదు పొందిన వారిలో 2020 నుంచి ఇప్పటి వరకు ఆర్మీ, పోలీస్, రైల్వే, సింగరేణిలో 25 మందికి పైగా ఉద్యోగాలు సాధించడం విశేషం.



"ప్రగతి మైదానం వంటి జిల్లాలోని క్రీడా స్థలాలను ఉద్యోగార్థుల సాధనకు అనువుగా తీర్చిదిద్దడంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి. వాకింగ్ ట్రాక్లు, జనరేటర్ లేక రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మా సాధనకు భూమిని జేసీబీ, రోలర్ వంటివాటి సాయంతో చదును చేయిస్తున్నాం. ఎస్సై కొలువే నా లక్ష్యం. కనీసం 300 మందైనా ఉద్యోగావకాశాలు దక్కించుకునేలా ఫిట్‌నెస్ పరంగా సాయం అందించాలని నిర్ణయించుకున్నా." - చిట్టెం హేమంత్ కుమార్



ప్రగతి మైదానంలో ఉద్యోగార్థులతో సాధన చేయిస్తున్న హేమంత్



"మాది సుజాతనగర్ మండలం మద్దిరాలతండా. పేద కుటుంబం కావడంతో ప్రగతి మైదానానికి వచ్చి హేమంత్ దగ్గర శిక్షణ తీసుకున్నా. గతేడాది ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై సంగారెడ్డి జిల్లాలో 9 నెలల శిక్షణ తీసుకుంటున్నా. హేమంత్ శిక్షణ ఇచ్చే తీరు, కసరత్తు ఎంతో బాగుంటుంది. ప్రతి అడుగు అర్థమయ్యేలా, ఓపిగ్గా నేర్పిస్తారు. నా స్నేహితులు గణేశ్, రాజేశ్‌లు కూడా ఉద్యోగాలు సాధించడం ఆయన చలవే." - జి.వేణు

విద్యార్థులు రాణించేలా..

కాకతీయ వర్సిటీలో జరిగే అంతర్ కళాశాలల పోటీల్లో పాల్గొనే విద్యార్థుల ఆసక్తిని గమనించి.. వారికి హేమంత్ మెలకువలు నేర్పుతుండటం విశేషం. ఈయన శిక్షణలో ఎంతోమంది పతకాలు సాధించారు. పలు జట్లు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి. ఇటీవల వరంగల్‌లో జరిగిన కేయూ వర్సిటీ పోటీల్లో లాంగ్‌జంప్, హైజంప్, వాలీబాల్, ఖోఖోలో రాణించి 2024-మహిళా ఛాంపియన్‌గా చాతకొండ టీడబ్ల్యూఆర్ఎస్ కళాశాల విద్యార్థినులు నిలిచేందుకు హేమంత్ కూడా ఓ కారణమని చెప్పాలి.



"హేమంత్ వద్ద పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్‌లో శిక్షణ తీసుకున్నా. 2022లో కేయూలో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించి అంతర్ వర్సిటీ పోటీలకు ఎంపికయ్యా. ప్రగతి మైదానంలోని శిక్షణ ఎంతో ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. రెండేళ్ల క్రితం దిల్లీలో జరిగిన ఎన్‌సీసీ ఫైరింగ్‌లో రజతం సాధించా. ఆర్మీ లేదా, ఎస్సై ఉద్యోగం నా లక్ష్యం. ఇందుకోసం శిక్షణకు తప్పకుండా హాజరవుతున్నా."

- షారుఖ్, బీఏ, రామచంద్ర డిగ్రీ కళాశాల

ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన సీఎం: మందకృష్ణ



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

ఖానాపురం హవేలి: సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన రోజు శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్గీకరణను దేశంలో మొదట అమలుచేసే రాష్ట్రం తెలంగాణ అని, ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఇప్పుడు మాలల ఒత్తిడికి తలొగ్గారని ఆరోపించారు. ఖమ్మంలో మాదిగల ధర్మయుద్ధ మహాసభలో శుక్రవారం మాట్లాడారు. మాదిగల వల్లే జడ్పీటీసీ సభ్యుడిగా, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచానని చెప్పిన సీఎం.. కమిషన్లు, కమిటీల పేరుతో వర్గీకరణ అమలులో జాప్యం చేస్తున్నారని చెప్పారు. వర్గీకరణ అమలుచేయకుంటే రేవంత్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్గీకరణ అమలు కాకుండా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నుంచి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వరకు సీఎంపై ఒత్తిడితెస్తున్నారని ఆరోపించారు. త్వరలో మండలాల్లో దీక్షలు, రథయాత్రలు చేస్తామని, డిసెంబరు నెలాఖరులో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందని ప్రకటించారు. సమితి జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, ఏపూరి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, భవాని చౌదరి, నర్సయ్య, పుష్పరాజ్, సుగుణరావు పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం భారీ ప్రదర్శనగా సభకు చేరుకున్నారు.

మధిరకు హైకోర్టు న్యాయమూర్తులు

మధిర: మధిరలో సబ్‌కోర్టు ప్రారంభంతోపాటు పాత కోర్టు ఆవరణలో కోర్టు భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైకోర్టు న్యాయమూర్తులు శుక్రవారం రాత్రి మధిర చేరుకున్నారు. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామిని న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ కాజా శరత్, జస్టిస్ భీమపాక నగేష్ శనివారం దర్శించుకుంటారు. అనంతరం కోర్టు భవనాలకు భూమిపూజ, తర్వాత సబ్‌కోర్టును ప్రారంభిస్తారు. వీఎస్ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో న్యాయవాదులు, పోలీసులు, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని మధిర కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు, కోర్టు భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కట్టా పూర్ణచంద్రరావు తెలిపారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో మహా పాదయాత్ర

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: మాలల ఐక్యత కోసం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్రను శుక్రవారం ఆరంభించారు. భద్రాచలం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి పాదయాత్ర ప్రారంభించారు. రాజ్యాధికారమే ధ్యేయమని, వర్గీకరణతో మాలలకు ఎన్నో విధాలుగా నష్టం జరుగుతోందన్నారు. 38 రోజులు, వెయ్యి కిలోమీటర్లు, 16 జిల్లాల్లోని 35 నియోజకవర్గాల్లో యాత్ర సాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో చేపట్టిన ఈ యాత్ర డిసెంబరు 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో ముగింపుసభతో ముగుస్తుందన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, నాయకులు ఎడ్ల గణపతి, కాల్వ సుందర్‌రావు, దారా చిరంజీవి, రమణమూర్తి తదితరులు హాజరయ్యారు.



పాదయాత్రలో పిల్లి సుధాకర్, మాలమహానాడు నాయకులు

విపత్తులను ఎదుర్కోవటంలో భాజపా విఫలం

ఏన్కూరు, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా విపత్తులు, ఉపద్రవాల సమయంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రజలను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు మందడపు సాయిబాబు ఆరోపించారు. ఆరికాయలపాడులో శుక్రవారం పార్టీ 9వ మండల మహాసభలో మాట్లాడారు. ఈ ఏడాది కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు అనేక చోట్ల భారీ వర్షాలకు ప్రాణ, పంటనష్టం తీవ్రంగా వాటిల్లిందని ఆ రాష్ట్రాలకు నిధులు కేటాయించడంలో భాజపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. భాజపా పాలిత రాష్ట్రాలకు మాత్రం నిధులు విడుదల చేస్తూ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. రాష్ట్రాల నుంచి జీఎస్‌టీ, ఇతర పన్నుల పేరుతో వసూళ్లు చేస్తున్నప్పటికీ నిధులు కేటాయింపులో సమానత్వం పాటించడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్పష్టమైన విధానాలు పాటించడం లేదని, ప్రణాళికలు లేకుండా పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. ఏ సమస్యపై ప్రశ్నించినా నాటి ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందని సమాధానమిస్తూ దాటేస్తున్నారని, ఎన్నికల హామీలు తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రారంభానికి ముందు భారీ ర్యాలీ నిర్వహించి, అమరవీరులకు నివాళి, జెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రంనాయక్, మెరుగు సత్యనారాయణ, దుగ్గి కృష్ణ, తాళ్లపల్లి కృష్ణ, మెరుగు రమణ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జాతీయ నాయకులు మందడపు సాయిబాబు

అటవీ ఉద్యోగుల సిమ్‌లకు రీఛార్జి బంద్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే



అటవీశాఖ ఉద్యోగులకు ఇచ్చిన సిమ్‌లు మూగబోయాయి. గత 8 ఏళ్ల నుంచి మనుగడలో ఉన్న నంబర్లు పని చేయక పోవడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. చివరకు ఏ అక్రమాలు జరిగినా సమాచారం అందే పరిస్థితులు లేకుండా పోయాయి. కొతకాలంగా చెట్ల నరికివేత, వన్యప్రాణుల వేట యథేచ్ఛగా జరుగుతున్నా కట్టడి చేయలేని దుస్థితి ఎదురవుతోంది. జిల్లాలో కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ టెరిటోరియల్, భద్రాచలం, కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ విభాగం డివిజన్లు ఉన్నాయి. రేంజ్‌ల సంఖ్య 21. ఉద్యోగులు 637 మంది ఉన్నారు. ఖమ్మంలో జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి డివిజన్లు, 6 రేంజ్‌ల పరిధిలో 340 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి గత ప్రభుత్వం సిమ్‌లు అందించింది. 'కాంపా' పథకం కింద ఎఫ్‌బీవో స్థాయి నుంచి ఎఫ్ఎస్‌వో, డీఆర్వో, రేంజర్, ఎఫ్‌డీవో, డీఎఫ్‌వోలు, సీఎఫ్, సీసీఎఫ్.. ఇలా ప్రతిస్థాయి అధికారికి సిమ్‌లు అందాయి. ఏరియాల్లో సిగ్నల్స్ పటిష్ఠంగా ఉన్న నెట్‌వర్క్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. వీటికి సంబంధించి ప్రతి నెలా రూ.500 రీఛార్జ్‌ను ప్రభుత్వమే చేయిస్తోంది. రోజుకు 1.5 జీబీ ప్లాన్ వర్తిస్తోంది. డిపార్ట్‌మెంట్ పరిధిలో అందరికీ ఫ్రీ కాల్స్ చేసుకునే ప్యాకేజీలున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వం ఆరు నెలల నుంచి రీఛార్జి చేయించడం లేదు. దీంతో అవి పనిచేయట్లేదు.

కొరవడిన సమన్వయం

ఫోన్ నంబర్లు మూగబోవడంతో అడవుల్లో అక్రమ రవాణాపై సిబ్బంది, అధికారులకు సమాచారం అందడం లేదు. గతంలో ఏదైనా అక్రమ రవాణా జరిగిన తక్షణమే స్థానిక పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది నుంచి స్థానిక అటవీ శాఖాధికారికి సమాచారం అందించేవారు. ఈ వ్యవస్థ అందుబాటులో లేక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం డీఎఫ్‌వో కిష్టాగౌడ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. రీఛార్జికి సంబంధించి బడ్జెట్ మంజూరు కావడం లేదన్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు.

బంగారు కవచాలతో రాములోరి దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవడంతో వీక్షించిన భక్తులు మురిసిపోయారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచనం చేశారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. పుష్యమి సందర్భంగా సీతా రామ పట్టాభిషేకం ఘనంగా సాగింది. పుణ్య జలాలను భక్తులపై చిలకరించి అంతా శుభం కలగాలని ఆశీర్వచనం అందించారు. దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. శనివారం బంగారు తులసీ దళార్చన నిర్వహించనున్నారు.



ఎమ్మెల్సీ కోదండరాం పూజలు: స్వామివారిని ఆచార్య కోదండరాం శుక్రవారం దర్శించుకున్నారు. ఈఓ రమాదేవి, ఏఈఓ భవానీరామకృష్ణారావు, ఈఈ రవీంద్రనాథ్, పీఆర్వో సాయిబాబా, సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేంసూరు: అడసర్లపాడుకు చెందిన తాటికొండ పాండురంగాచారి(44)రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతిచెందారు. పాండురంగాచారి మర్లపాడులో తాను నిర్వహిస్తున్న ఫౌండ్రీ వద్దకు బైకుపై వస్తుండగా గ్రీన్ ఫీల్డ్ హైవే టిప్పర్ కల్లూరుగూడెం వద్ద ఢీకొంది. బైక్‌పైనున్న పాండురంగాచారి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని సత్తుపల్లికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

గాయపడిన యువకుడు..

దుమ్ముగూడెం: చినార్లగూడెం సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు గురువారం రాత్రి మృతి చెందాడు. నారాయణరావుపేటకు చెందిన జంపన్న (21), కొమరం వీర్రాజు గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడడంతో జంపన్న అక్కడికక్కడే మృతిచెందిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన కొమరం వీరయ్యను(20) మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే గురువారం రాత్రి మృతి చెందారు.

మద్యం మత్తులో యాసిడ్ తాగిన వ్యక్తి..

పెనుబల్లి: మద్యం మత్తులో యాసిడ్ తాగిన వ్యక్తి మృతిచెందాడు. కేడబ్ల్యూ చౌడవరానికి చెందిన కణితి సత్యనారాయణ(45) ఈనెల 16న మద్యంతాగి ఇంటికొచ్చాడు. దాహం వేయడంతో ఇంట్లో బ్యాటరీల్లో నింపే యాసిడ్‌ను మంచినీళ్లు అనుకొని పొరపాటున తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గమనించారు. తొలుత పెనుబల్లి వైద్యశాలకు, అక్కడి నుంచి సర్వజనాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సీఆర్‌పీఎఫ్ 199 బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్(38) శుక్రవారం విధులు నిర్వర్తిస్తూ తన సర్వీస్ రివాల్వర్‌తో తలపై కాల్చుకున్నాడు. పేలుడు శబ్దానికి పక్కనే ఉన్న జవాన్లు వచ్చేసరికే రక్తపు మడుగులో పడి ప్రాణాలు వదిలాడు.

బ్యాంకు చోరీకి యత్నం

కల్లూరు: కల్లూరులోని ఏపీజీవీబీలో చోరీకి దుండగులు విఫల యత్నం చేశారు. బ్యాంక్ మేనేజర్ తెలిపిన ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం బ్యాంకు తెరిచే సమయంలో షట్టర్ తాళం పగలగొట్టి ఉన్నట్టు సిబ్బంది గుర్తించారు. అనంతరం సీసీ కెమెరాలు పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టినట్టు గుర్తించారు.

వ్యభిచార నిర్వాహకురాలికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు: పలువురు అమ్మాయిలను వ్యభిచార వృత్తిలోకి దింపిన మహిళకు న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.3,19,000 జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఖమ్మంలోని గుర్రాలపాడు కాలనీకి చెందిన కుక్కల ఆశ అలియాస్ సైదాబి(25) డబ్బు వల వేసి అమ్మాయిలను కొని వ్యభిచార కూపంలోకి దింపేది. ఈ తరహాలోనే ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళ(35)ను మభ్యపెట్టి ఆమె కుమార్తె(16)ను రూ.10వేలకు కొని ఈ వృత్తిలోకి లాగింది. వేధింపులు భరించలేక వారి చెర నుంచి తప్పించుకొని బాలిక హయత్‌నగర్ పరిధిలో ఉండే అక్క ఇంటికి చేరుకుంది. బాలిక తల్లి, ఆశ, గోపి, విజయ్, మరో బాలుడు(15) కలిసి హయత్‌నగర్‌కు వచ్చి బాధితురాలిని ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా స్థానిక పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఆశకు రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి హరీశ శుక్రవారం శిక్ష, జరిమానా విధిస్తూ తుది తీర్పునిచ్చారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

ఎర్రుపాలెం మండలానికి మహర్దశ

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే



ఎర్రుపాలెం- అమరావతి-నంబూరు నూతన రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నూతనంగా నిర్మించే 57 కి.మీ. రైల్వే లైన్‌కు భూసేకరణ పనులు వేగవంతం కానున్నాయి. ఇప్పటికే ఏపీలో భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో వారం రోజుల్లో భూసేకరణ సర్వే మొదలుకానుంది.

57 కి.మీ. రైల్వేలైన్

ఎర్రుపాలెం నుంచి అమరావతికి రైల్వేలైన్ 2018లో మంజూరైంది. 2019లో ఏపీలో వైకాపా అధికారంలోకి వచ్చాక ఈప్రాజెక్టుపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించింది. తాజాగా కూటమి ప్రభుత్వం కొలువు దీరటం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటంతో రైల్వేశాఖలో కదలిక వచ్చింది. ఎర్రుపాలెం-అమరావతి- నంబూరు నిర్మాణానికి 56.53 కిలోమీటర్ల రైల్వేట్రాక్ నిర్మాణానికి ఖమ్మం, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 450 హెక్టార్ల భూమి సేకరించనున్నారు. భూసేకరణ, రైల్వేట్రాక్ నిర్మాణానికి రూ.2,245 కోట్లు ఖర్చవుతాయని రైల్వేశాఖ అంచనా వేసింది. నాలుగేళ్లలో ఈ పనులు పూర్తవుతాయని భావిస్తోంది. తెలంగాణలో ఎర్రుపాలెంలోని రైల్వేస్టేషన్ సమీపం నుంచి ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా పెద్దాపురం వరకు భూసేకరణకు ఖమ్మం జిల్లాలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌ను నియమించింది. కొత్తపల్లి-వడ్డమాను గ్రామాల మధ్య 3.2 కి.మీ. మేర వంతెన అందుబాటులోకి రానుంది.

నూతనంగా తొమ్మిది రైల్వేస్టేషన్లు

నూతనంగా నిర్మించే రైల్వేలైన్ విజయవాడ-హైదరాబాద్ లైన్‌లోని ఎర్రుపాలెం వద్ద మొదలై అమరావతి మీదుగా నంబూరు వద్ద కలుస్తుంది. ఎర్రుపాలెం-అమరావతి రైల్వేలైన్‌లో నూతనంగా తొమ్మిది రైల్వేస్టేషన్లను నిర్మించనున్నారు. ఎర్రుపాలెం తర్వాత ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరులో నూతన స్టేషన్లు అందుబాటులోకి వస్తాయి. ఈరైల్వేలైన్‌తో అమరావతి రాజధానికి చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా అనుసంధానించనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. నూతన రైల్వేలైన్ నిర్మాణంతో ఎర్రుపాలెం మండలానికి మహర్దశ పట్టనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ జంక్షన్‌గా మారే అవకాశముందని సంబరపడుతున్నారు.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా

సత్తుపల్లిలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



శుద్ధజల ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం షాలేంరాజు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలోని ఓసీ ప్రభావిత వెంగళరావునగర్, ఎన్టీఆర్ నగర్ ప్రజల కోసం సింగరేణి యాజమాన్యం శుక్రవారం శుద్ధజలం ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చారు. రెండు ప్రాంతాల్లోని ప్లాంట్‌లు పాడైపోవటంతో స్థానికుల అభ్యర్థన మేరకు రూ.1.3 లక్షలతో మరమ్మతులు చేయించారు. వీటిని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజు శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. కె.దేవదాస్, వార్డు కౌన్సిలర్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

‘ఉత్తమ పౌరులుగా ఎదగాలి’

కారేపల్లి: ప్రతీ విద్యార్థి భవిష్యత్ తరాలకు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సీఐ తిరుపతిరెడ్డి, డా.పర్సా పట్టాభి రామారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో ప్రధానాచార్యురాలు ఎన్.విజయకుమారి అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. సమాజాన్ని చదవాలని శ్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, మహిళ పోస్టుమెట్రిక్ హాస్టల్ వార్డెన్ స్వర్ణలత పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: లక్ష్మీపురం వీధి పక్కన ఎయిర్ వాల్వ్ లీకుతో పంచాయతీ నీరు వృథాగా పోతోంది. - స్థానికులు

సమాధానం: సిబ్బంది సాయంతో మరమ్మతు చేయిస్తాం. **నాగేశ్వరరావు, కార్యదర్శి**

– కల్లూరు, న్యూస్‌టుడే

పైపులైన్‌కు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఏన్కూరులో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు చేపట్టి ఉన్నత పాఠశాల ట్యాంకుకు నీటి సరఫరా చేశారు. సమస్యపై ‘పైపులైన్ పగిలి.. సరఫరా నిలిచి’ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఏఈ సురేశ్ తమ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. శుక్రవారం నీటి సరఫరా కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కుటుంబాలకు వైద్య పరీక్షలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి డిపోలోని ఉద్యోగుల జీవిత భాగస్వాములకు వైద్య పరీక్షలు నిర్వహించే గ్రాండ్ హెల్త్‌చాలెంజ్-ఎస్‌ను సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఉద్యోగుల ఆరోగ్య భద్రతతోపాటు జీవిత భాగస్వామి ఆరోగ్యం కూడా ముఖ్యమైనదనే భావనతో సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఆదేశాలను సారం సత్తుపల్లి డిపోలో ఈ నెల 25, 26, 28, 29లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, చిత్రంలో డీఎం రాజ్యలక్ష్మి

లాభాల సంత.. లేకనే చింత

మధిరలో ఏర్పాటు చేస్తే పలు గ్రామాల ఇబ్బందులకు చెల్లుచీటి

◆ బోనకల్లు మండలంలోని లక్ష్మీపురం వాసులు ఏపీలోని చిల్లకల్లు, నందిగామ.. ఎటు వెళ్లాలన్నా 35 కి.మీ. ప్రయాణించాలి.

◆ మధిర మండలంలోని మల్లవరం, ఇల్లూరు, మహదేవపురం తదితర ప్రాంతాల ప్రజలు కుటుంబ వేడుకల సమయంలో జీవాల కోసం 70 కి.మీ. పైగా ప్రయాణించి కామేపల్లి మండలం పండితాపురం సంతకు వెళ్తుంటారు.

◆ ఎర్రుపాలెం మండలంలోని కాసారం గ్రామస్థులు చిల్లకల్లు వెళ్లిరావాలంటే 120 కి.మీ. ప్రయాణం తప్పదు.

మధిర, న్యూస్‌టుడే

మధిర మున్సిపాలిటీలో పశువుల సంత లేకపోవడంతో పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పశువులు, జీవాల కొనుగోళ్లు, విక్రయాలకు కనీసం 25 నుంచి 70 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోంది. మధిరతోపాటు బోనకల్లు, ఎర్రుపాలెం మండల వాసులకు వ్యయ ప్రయాసలు తప్పటం లేదు. మరోవైపు మధిర పురపాలకం ఏటా సంత రూపంలో పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోతోంది.

ఏపీ, తెలంగాణ సరిహద్దులో ఉండే మధిర మేజర్ గ్రామ పంచాయతీలో నాలుగున్నర దశాబ్దాల క్రితం వరకూ శివాలయం వద్ద పశువుల సంత నిర్వహించేవారు. నియోజకవర్గ వాసులతోపాటు ఏపీ ప్రాంతవాసులూ పెద్ద సంఖ్యలో వస్తుండటంతో అప్పట్లోనే పంచాయతీకి మంచి ఆదాయం వచ్చేది. అయితే నిర్వాహకులు వేలం రుసుం చెల్లించకపోవడం, సరైన రీతిలో నిర్వహించకపోవడంతో కొన్నేళ్ల తర్వాత ఇక్కడ కార్యకలాపాలు మూలనపడ్డాయి. ఆ తర్వాత వైరా మేజర్ గ్రామ పంచాయతీలో పశువుల సంత ఏర్పాటు చేశారు. అదీ 25 ఏళ్లకు పైగా విజయవంతంగా కొనసాగింది. మున్సిపాలిటీగా రూపాంతరం చెందాక కూడా ఇక్కడి సంత వేలం ఏడాదికి రూ.20 నుంచి 23 లక్షల వరకు పలికింది. అయిదేళ్ల క్రితం వైరాలో స్థల సమస్యతో ఇక్కడా నిలిచిపోయింది. దీంతో కనుచూపు మేరలో అంగడి సదుపాయానికి ఆస్కారమే లేకుండా పోయింది.



సంతలో కొనుగోలు చేసిన పొట్టేళ్లు



	బోనకల్లు	ఎర్రుపాలెం	మధిర
తెల్లజాతి పశువులు	2,723	1,979	3,512
గేదెలు	14,357	20,547	19,917
గొర్రెలు	36,303	34,438	27,124
మేకలు	2,864	3,746	5,195
పందులు	11	190	934
కోళ్లు	23,500	1,58,647	38,147


వైరాలో కూడా సంత నిలిచిపోవటంతో ఎర్రుపాలెం, మధిర, బోనకల్లు వాసులు జంతు కొనుగోలుకు పక్క రాష్ట్రంపై ఆధారపడుతున్నారు. సరిహద్దులో ఉన్న ఏపీ ఎన్టీఆర్ జిల్లా నందిగామ, చిల్లకల్లు సంతలను ఆశ్రయిస్తున్నాయి. జీవాల క్రయవిక్రయాల కోసం ఖమ్మం జిల్లాలోని పండితాపురం సంతకు వెళ్తున్నారు. మధిరలో పశువుల సంతను ఏర్పాటుచేస్తే మున్సిపాలిటీకి ఆదాయం లభించటమే కాకుండా సుమారు వంద గ్రామాల ప్రజలకు వెసులుబాటు ఉంటుంది. ఎందుకంటే సరిహద్దున ఉన్న మధిరకు వీరులపాడు, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన పలు గ్రామాలు ఆనుకునే ఉంటాయి. సంత ఏర్పాటుకు కావల్సిన అనుకూలతలన్నీ పట్టణంలో ఉన్నాయి.

స్థానికంగా ఉంటే..

★ జాతర సమయంలో మినహా మిగిలిన సమయంలో ఖాళీగా ఉండే శివాలయ ప్రాంగణంలోనే గతంలోలా నిర్వహించొచ్చు. సమీపానే ఏరు ఉండటంతో మూగజీవాలకు తాగునీటి ఇబ్బంది ఉండదు.

★ ప్రత్యామ్నాయంగా మార్కెట్ యార్డులో ఖాళీ స్థలం ఉంది.

మధిరలో ఏర్పాటు చేయాలి: పుచ్చకాయల మధు



పదేళ్లుగా పశువులు, గేదెల వ్యాపారం చేస్తున్నా. రైతులకు అవసరమైన పాడి గేదెలు, ఎద్దులను వివిధ సంతల్లో తిరిగి కొనుగోలు చేస్తుంటా. మధిరలో పశువుల సంతలేకపోవడం వల్ల ఇబ్బందులు తప్పటం లేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది.

‘మధిరలో పశువుల సంత ఆవశ్యకతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా. దీని ఏర్పాటుకు ఉన్నతాధికారి అనుమతిచ్చారు. అయితే కౌన్సిల్‌లో తీర్మానం చేయాల్సి ఉంది. ఆ తర్వాతనే ఏర్పాటు ప్రక్రియ చేపడతాం.’

- రేవతి, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



మధిర చెరువులో చేప పిల్లలు వదులుతున్న మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్ తదితరులు

మధిర, న్యూస్‌టుడే: మత్స్యకారులకు ప్రభుత్వం ఇస్తున్న వంద శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిసనర్ సంపత్, ఛైర్‌పర్సన్ ఎం.లత, మత్స్య శాఖ జిల్లా అధికారి జి.శివప్రసాద్ సూచించారు. మధిర పెద్ద చెరువుతోపాటు మడుపల్లి, రాయపట్నం, దేశినేనిపాలెం, వంగవీడు తదితర గ్రామాల్లో శుక్రవారం చేప పిల్లలను జిల్లా అధికారి జి.శివప్రసాద్ తెలిపారు. క్షేత్రస్థాయి అధికారిణి గ్రీష్మ, నీటిపారుదల శాఖ ఏఈ అఖిల్, సొసైటీ అధ్యక్షుడు పి.సుబ్బారావు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి: పీఆర్టీయూ

మధిర పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేయించుకోవాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, మైనార్టీ, గురుకుల పాఠశాలల్లో మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఆర్.బ్రహ్మారెడ్డి, సీహెచ్‌వీ రవికుమార్, తూమాటి కృష్ణారెడ్డి, పిల్లి నర్సింహారావు, ఎల్.అప్పారావు, మల్లెల శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుల్లయ్య అరెస్టుపై ఖండన

చింతకాని, న్యూస్‌టుడే: భారాస మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్న తీరుపై సీపీఎం మండల శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. చింతకానిలో శుక్రవారం పార్టీ నాయకులు మాట్లాడుతూ ధర్నాలు, రాస్తారోకోలు ప్రజాస్వామ్యంలో సహజమని, విద్యుదాఘాతంతో మరణించిన రైతు కుటుంబానికి సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన పుల్లయ్యపై కేసులు నమోదు చేయటం దారుణమన్నారు. ★ భారాస మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అరెస్టును ఖండిస్తున్నట్లు భాజపా మండలాధ్యక్షుడు కొండా గోపి పేర్కొన్నారు.

‘చిత్తశుద్ధితో కుల గణన చేపట్టాలి’

సత్తుపల్లి, న్యూస్‌టుడే: కుల గణనను చిత్తశుద్ధితో చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లిలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీ ప్రకారం రాష్ట్రంలోని బీసీ జనాభాను లెక్కించాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అమిద్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో ఉచిత వైద్య శిబిరం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: కిష్టారం ఓసీ ప్రభావిత ప్రాంతమైన చెరుకుపల్లిలో సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చెరుకుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఈ శిబిరాన్ని మేనేజర్ రామకృష్ణ ప్రారంభించారు. సింగరేణి వైద్యురాలు శిరీష ఆధ్వర్యంలో గ్రామస్థులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యదర్శి రాజ్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: మీనవోలు గ్రామంలో శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. తక్కెళ్లపాడు రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో గోవులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పశువైద్యులు కృష్ణారెడ్డి, ఉమా పాల్గొన్నారు.

మహా సమ్మేళనం విజయవంతానికి వినతి

తల్లాడ, న్యూస్‌టుడే: నవంబరు 3న హైదరాబాద్‌లో జరిగే ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి రాంబాబు అన్నారు. శుక్రవారం తల్లాడలో పార్టీ మహాసమ్మేళనం కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు మేడి బసవయ్య, శివన్‌మహారాజ్, వెల్లంకి కాంతారావు, కొమ్ముగిరి శ్రీనివాసరావు, పమ్మి నరసింహారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

రంగారావుకు పలువురు నివాళి

వైరా, న్యూస్‌టుడే: తాటిపూడికి చెందిన సహకార సొసైటీ మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచి తాతా రంగారావు మృతదేహానికి పలువురు శుక్రవారం నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, రాములునాయక్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఇతర నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. శుక్రవారం రంగారావు అంత్యక్రియలు పూర్తయ్యాయి.

గోడప్రతుల ఆవిష్కరణ

మధిర, న్యూస్‌టుడే: టీఎన్‌జీవోల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి అంతా హాజరు కావాలని కోరుతూ నాయకులు గుర్రం శ్రీను, గద్దల రజనీకాంత్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ రాంబాబు చేతుల మీదుగా ప్రచార గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ ప్రతులను ఎంఈవో కార్యాలయంలో వై.ప్రభాకర్, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ సాంబయ్య, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ మధు ఆవిష్కరించారు. నవంబరు 3న చెరుకూరి వారి మామిడి తోటలో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు.

జామే మజీద్ కమిటీ సదర్‌గా నాయబ్ రసూల్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి జామే మజీద్, మార్కెట్ కమిటీ సదర్(అధ్యక్షులు)గా షేక్ నాయబ్ రసూల్ శుక్రవారం ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడ్ని పలువురు అభినందించారు. ఎండీ కమల్‌పాషా, షేక్ మౌలాలీ, షేక్ రఫీ, ఎండీ రియాజుద్దీన్, షేక్ మునీర్, షేక్ వాహేద్, అబీద్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం నాగరాజు దంపతులు: ఎంఈఓ

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: పేద కుటుంబంలో జన్మించి సీఆర్‌టీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన గౌర్రాజు నాగరాజు, సోషల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన ఆయన సతీమణి స్రవంతిని శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ మురళీమోహన్ ఆధ్వర్యంలో సన్మానించారు. వివిధ సంఘాల బాధ్యులు ఎ.కోటేశ్వరరావు, ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్.సంగిరెడ్డి, ఎస్.మదన్‌మోహన్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, సైదారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దాసరి పద్మ సేవలు చిరస్మరణీయం

తల్లాడ, న్యూస్‌టుడే: సినీ నిర్మాత, సంఘ సేవకురాలు దాసరి పద్మ సేవలు చిరస్మరణీయమని ఎంఈవో ఎన్.దామోదరప్రసాద్ అన్నారు. అన్నారుగూడెం ఉన్నత పాఠశాలలో దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు గుమ్మా నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం దాసరి పద్మ జయంతి నిర్వహించారు. కొమ్మినేని వెంకటేశ్వర్లు, గుమ్మా నరేష్ పాల్గొన్నారు.

సగమే వెలుగులు.. మిగిలిందంతా దిగులే



జలాశయం ఆనకట్టపై ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు సగమే పని చేస్తున్నాయి. రూ.లక్షల వ్యయంతో సుమారు 75 లైట్లు ఏర్పాటు చేయగా కొద్ది నెలల క్రితం 30 లైట్లకు చెందిన బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. దీంతో అప్పటి నుంచి ఇవి పని చేయడం లేదు. మరికొన్ని లైట్ల వైర్లు, ఇతర సామగ్రిని కోతులు పాడు చేశాయి. దీంతో చాలా లైట్లు వెలగడం లేదు. చోరీ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టుబడలేదు. చివరకు అరకొర వెలుగులే దిక్కయ్యాయి. సోలార్ వెలుగులు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు. – వైరా, న్యూస్‌టుడే

సుడా పరిధిలోకి మరిన్ని మండలాలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ(సుడా)ను విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను శుక్రవారం జారీచేసింది. 2017 అక్టోబర్ 24న ఏడు మండలాలు, 46గ్రామాలతో ఏర్పాటు చేసిన సుడాలో.. ఏడేళ్ల తరువాత అదే రోజున తొమ్మిది మండలాలు, 279 పంచాయతీలను కలపటం విశేషం. రఘునాథపాలెం మండలంలో కొత్తగా పాపడపల్లి, ఈర్లపూడి, మల్లేపల్లి చింతగుర్తి, వేపకుంట్లను కలిపారు. ఖమ్మం గ్రామీణ మండలంలో కొత్తగా కాచిరాజుగూడెం, తనగంపాడు, అరేకోడు, కొండాపురం, తిరుమలాయపాలెం మండలంలో 25 గ్రామాలు, నేలకొండపల్లి మండలంలో 23, ముదిగొండ మండలంలో 19, చింతకాని మండలంలో 10, కొణిజర్ల మండలంలో 11, కల్లూరు మండలంలో 23, పెనుబల్లి మండలంలో 17, సత్తుపల్లి మండలంలో 12, వేంసూరు మండలంలో 14, తల్లాడ మండలంలో 19, వైరా మండలంలో 20, బోనకల్లు మండలంలో 18, మధిర మండలంలో 20, ఎర్రుపాలెం మండలంలో 24 గ్రామాలను కలుపుతున్నట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి.

గంగారం బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



గంగారంలో విద్యార్థులకు ఆయుధాల పనితీరు వివరిస్తున్న అధికారులు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: గంగారం 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్‌లోని వివిధ రకాల అత్యాధునిక ఆయుధాలను పాఠశాల విద్యార్థుల సందర్శనార్థం ప్రదర్శించారు. కమాండెంట్ పీజేపీసీ ఛటర్జీ మాట్లాడుతూ పిల్లలకు అవగాహన కోసం ఓపెన్ హౌస్ నిర్వహించామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ రంగారెడ్డి, డీపీవీ స్కూల్, విశ్వశాంతి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

టీకాల నమోదు తప్పనిసరి: చందునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న చందునాయక్

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో నిర్వహించే టీకాలు కార్యక్రమ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి చందునాయక్ పేర్కొన్నారు. దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీకాల నిల్వ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. స్థానిక వైద్యాధికారి డా పృథ్వీరాజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: బనిగండ్లపాడు పీహెచ్‌సీని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందూనాయక్ శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలోని ఐ.ఎల్.ఆర్‌ను పరిశీలించి, దస్త్రాలను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. పిల్లలందరికీ వందశాతం టీకాలందించాలని సూచించారు. మాటూరుపేట వైద్యుడు వీరబాబు, పీహెచ్‌సీ వైద్యులు ప్రశాంత్, శశిపూర్ణ, వ్యాక్సిన్ నిర్వహణ అధికారి రమణ, సీహెచ్‌ఓ కాంతమ్మ, హెచ్‌ఈఓ సదాశివరావు పాల్గొన్నారు.

కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలి



కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు

ఏన్కూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఏన్కూరు వచ్చిన శిక్షణ కేంద్ర సర్వీసుల అధికారులు సూచించారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మూడు రోజులపాటు లచ్చగూడెంలో గ్రామ పరిపాలన పరిశీలించిన అధికారులు శుక్రవారం మండల కార్యాలయాలు, విద్యాలయాలు సందర్శించారు. తొలుత కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థినులతో మాట్లాడారు. తెలంగాణ గురుకుల విద్యాలయాన్ని చూశారు. విద్యార్థులతో కలిసి కొద్దిసేపు ఆటలాడారు. ఉదయం మేడేపల్లి సమీపంలోని అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, స్టేషన్ సేవలు తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎస్.రమేశ్, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో జీవీఎస్ నారాయణ, ప్రధానాచార్యులు టి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కారేపల్లి, న్యూస్‌టుడే: సివిల్ సర్వీస్ విభాగ శిక్షణ అధికారులు ఆల్యాతండాలో ఐదు రోజులపాటు చేపట్టిన పర్యటన శుక్రవారం ముగిసింది. చివరి రోజు ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి సేవలను అడిగి తెలుసుకున్నారు.

పరిహారం జాబితా రైతులకివ్వాలి

బోనకల్లు, న్యూస్‌టుడే: పంట నష్ట పరిహారానికి అర్హత సాధించిన రైతుల జాబితాలు విడుదల చేయాలని రైతుసంఘం, సీపీఐ డిమాండ్ చేశాయి. పంటనష్ట సర్వేలో మండలంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని రైతుసంఘం జిల్లా నాయకుడు నరసింహారావు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు రోషన్‌కుమార్, ఆనందరావు ఆరోపించారు. శుక్రవారం బ్రాహ్మణపల్లిలో బాధిత రైతులతో కలిసి వారు మాట్లాడారు. ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలవనున్నట్టు తెలిపారు. కొంగర కృష్ణయ్య, గాలి కోటయ్య, కొంగర శ్రీకాంత్ పాల్గొన్నారు.

వెంకట్రామయ్యకు నివాళి

మధిర, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపక సభ్యుడు అద్దంకి వెంకట్రామయ్య (75) మృతి తెదేపాకు తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. 16వ వార్డులోని తన స్వగృహంలో శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కౌన్సిలర్లు వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, నాగసులోచన, నాయకులు చేకూరి శేఖర్‌బాబు, జగన్ తదితరులు వెంకట్రామయ్యకు నివాళి అర్పించారు.

అనారోగ్యంతో సింగరేణి ఉద్యోగి మృతి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: జేవీఆర్ ఉపరితల గని పీవో వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న కొప్పుల గోవర్ధన్‌రెడ్డి(55) గురువారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. గోవర్ధన్‌రెడ్డి మృతదేహానికి అతని స్వగ్రామం రేజర్లలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ నివాళి అర్పించారు. ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం: పొన్నం



మహాసభలో మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పోరాటాల ద్వారా పరిష్కారం అవుతాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం నక్కగరుబు గ్రామంలో పార్టీ మండల 8వ మహాసభ నాయకులు ఊట్ల శంకర్‌రావు, దొంతి వీరాచారి, వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. పొన్నం మాట్లాడుతూ భారాస, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికారం కోల్పోయాక మరోరకంగా ఉంటున్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, శీలం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. ★ పార్టీ మండల కార్యదర్శిగా మందా సైదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కమల్‌రాజు జన్మదిన వేడుకలు

మధిర, న్యూస్‌టుడే: జడ్పీ మాజీ ఛైర్మన్, నియోజకవర్గ భారాస ఇన్‌ఛార్జి లింగాల కమల్‌రాజు పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం మధిరలో పట్టణ, మండల యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. మదర్ థెరిస్సా సేవాసదనంలో అన్న వితరణ చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, అరిగె శ్రీను, అబ్బూరి రామన్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఎర్రుపాలెంలోని భారాస కార్యాలయంలో జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, షేక్ మస్తాన్‌వలి, ఎస్.రామకోటేశ్వరరావు, ఎస్.తిరుపతిరావు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి కేక్ తినిపిస్తున్న భారాస నాయకులు

విద్యుత్తు మోటార్లు అపహరణ

చింతకాని, న్యూస్‌టుడే: లచ్చగూడెంలో రెండు వ్యవసాయ విద్యుత్తు మోటార్లు గురువారం రాత్రి అపహరణకు గురయ్యాయి. రైతు వంకాయలపాటి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

కేసు నమోదు

చింతకాని, న్యూస్‌టుడే: పందిళ్లపల్లి సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం గురువారం ఢీకొన్నాయి. బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వేగంగా రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొట్టినట్లు డ్రైవర్ బాణోత్ మధు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నూర్‌మహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

బాలికపై దాడి

చింతకాని: ప్రొద్దుటూరుకి చెందిన ఓ మైనర్ బాలికపై మేనమామ, తాత, అత్తయ్య దాడి చేసి కొట్టారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఏర్పాటు



దారుకాబంజరు చెక్‌పోస్టు వద్ద తహసీల్దార్, ఎస్సై తదితరులు

కల్లూరు, న్యూస్‌టుడే: దారుకాబంజరు, తాళ్లూరు వెంకటాపురం గ్రామాల్లో అంతర్రాష్ట్ర వ్యవసాయ చెక్‌పోస్టులను శుక్రవారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ పులి సాంబశివుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పండించిన వరి ధాన్యాన్ని మాత్రమే స్థానిక కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని, ఏఈఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, ఏఓ రూప, ఎస్ఐ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్లు, న్యూస్‌టుడే: మండలంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసిన దృష్ట్యా ఏపీ నుంచి ధాన్యం రాకుండా చూసేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. బోనకల్లు వద్ద శాశ్వత, చొప్పకట్లపాలెం వద్ద తాత్కాలిక చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తున్నారు. చెక్‌పోస్టులో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారుల్ని నియమిస్తున్నారు. చెక్‌పోస్టుని శుక్రవారం తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో రమాదేవి ప్రారంభించారు. ఎస్సై మధుబాబు, ఎంపీవో సుబ్రహ్మణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏన్కూరు: ఏన్కూరు విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9నుంచి ఒంటిగంట వరకు మండల కేంద్రంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఉమాకాంత్ తెలిపారు.

వరి.. నేలవాలి

కల్లూరు, న్యూస్‌టుడే

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట, చేతికి అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాల బారినపడి కన్నీళ్లను మిగులుస్తోంది. సరైన దిగుబడి రాక రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్న రైతులను మరోసారి అకాల వర్షాలు వెన్నువిరుస్తున్నాయి.

ఈ ఏడాది ఖరీఫ్ సాగు సమయంలో వర్షాలు సరిగా లేకపోవటంతో నాట్లు ఆలస్యమయ్యాయి. తర్వాత రోజుల్లో వానలు సమృద్ధిగా కురియటంతో రైతులు వరి వేశారు. నీటి సమస్య లేకపోవటంతో ఎండిపోయే పరిస్థితి లేక ప్రస్తుతం పొట్ట, చిరుపొట్ట దశకు పైరు చేరింది. ఈ నేపథ్యంలో పది రోజుల నుంచి ఉదయం ఎండకాస్తూ, సాయంత్రానికి తీవ్రమైన ఈదురుగాలులతో వర్షాలు వస్తున్నాయి. ఫలితంగా వరి నేలకు పడిపోతోంది. ముఖ్యంగా సన్నరకాలు ఏపుగా ఎదిగి నేలవాలుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



ఎర్రబోయినపల్లి గ్రామంలో నేలవాలిన వరి పైరు

ఎక్కడెక్కడ..

మండలంలో 33,700 ఎకరాల్లో సాగు చేశారు. కల్లూరు, పుల్లయ్యబంజర్, చంద్రుపట్ల, లింగాల, రఘునాధగూడెం, ఎర్రబోయినపల్లి తదితర గ్రామాల్లో చాలాచోట్ల వరి నేలవాలింది. వీటిని కోత కోయాలంటే ఎక్కువ సమయం పడుతుంది. ఎకరాకు కోత మిషన్లు అధికంగా వసూలు చేస్తున్నాయి. ఫలితంగా వ్యయం అధికమవుతోంది. సుంకురాలి తాలుగా మారితే ఎకరాకు 10-15 బస్తాల దిగుబడి తగ్గొచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు.



‘నేను 13 ఎకరాల్లో వరి సన్నాల రకం పంట వేశా. ఈదురు గాలులకు సుమారు 8 ఎకరాల పంట నేలపైపడి తీవ్ర నష్టాన్ని మిగిలించింది.’

- గద్దె శ్రీనివాసరావు, ఎర్రబోయినపల్లి



‘రఘునాథగూడెం మాది. పది ఎకరాల్లో సన్నరకాల పంట చేస్తా. నాలుగు ఎకరాలు నేలవాలిందని అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ద్వారా పరిహారం అందించాలని కోరారు.’

- రావూరి నరసింహారావు

రైతుల ఫిర్యాదు మేరకు పంట అంచనావేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. **- ఏఓ రూప**

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

రెండో రోజూ న్యాక్ బృందం పరిశీలన



ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం రెండో రోజు శుక్రవారం అన్ని రికార్డులను పరిశీలించింది. బృందం ఛైర్మన్ డా.పురుషోత్తం నాయక్, మెంబర్ కో ఆర్డినేటర్ డా.చంద్రికాలయం, మెంబర్ జోసఫ్‌లు పలు విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలించిన అంశాలను సీల్డ్‌కవర్‌లో ఉంచి కళాశాల ప్రిన్సిపల్ పద్మావతికి న్యాక్ బృందం అందజేసింది. సాయంత్రం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.జి.పద్మావతి, అధ్యాపకులు జానకిరామారావు, రాకేశ్, కృష్ణవేణి, రాజిరెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

29న మెగా ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం కమాన్‌బజార్ న్యూస్‌టుడే: ఈ నెల 29న రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సీఎంను కలిసిన గోపాల్‌రెడ్డి



రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన రాంరెడ్డి గోపాల్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. తన సేవలను గుర్తించి డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.
- కామేపల్లి, న్యూస్‌టుడే

అయోడిన్ ఉప్పు వాడకంపై అవగాహన

నేలకొండపల్లి: నేలకొండపల్లి ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం, బీసీ పాఠశాల బాలికల వసతిగృహం, సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల కళాశాలలో మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో అడియోన్ ఉప్పు వాడకంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డా.శ్రావణ్‌కుమార్ విద్యార్థులకు అయోడిన్ ఉప్పు వాడకం గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ పద్మావతి, సంక్షేమాధికారులు మున్నీసా బేగం, సౌజన్య, హెచ్ఈవో వీరన్న, స్టాఫ్‌నర్సు దివ్య, హెల్త్‌అసిస్టెంట్ రాణి పాల్గొన్నారు.

పింఛనులో కోత నిలిపివేయాలని వినతి

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: తమ పింఛనులో ప్రభుత్వం కమ్యూటెడ్ పోర్షన్‌ను మినహాయించడంపై హైకోర్టు స్టే విధించిందని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ అన్నారు. పింఛనులో కోతను నిలిపివేయాలని ఖజానా డీడీకి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

ఎవరికి దక్కేనో క్రీడా మైదానం!

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్ అకాడమీ ఉంది. జాతీయ, అంతర్జాతీయ పతకాలే లక్ష్యంగా ప్రభుత్వం దీన్ని ఏర్పాటు చేసింది. ఇందులోని వారితోపాటు పాటు మరో వందమంది స్థానిక క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. అంతర్జాతీయ ప్రమాణాల్లో క్రీడాకారులు ఎదగాలంటే సింథటిక్స్ ట్రాక్ ఏర్పాటు చేయాలని అథ్లెటిక్స్ సమాజం కోరుతోంది. ఇందుకు స్పందించిన జిల్లా యంత్రాంగం రూ.8.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయినా అడుగు ముందుకు పడటం లేదు.



సర్దార్ పటేల్ స్టేడియం ప్రధాన మైదానం

★ అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ఆ మైదానంలో క్రికెట్ ఆడేందుకు అవకాశం ఉండదు. మైదానాన్ని అలానే ఉంచేసి అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్ మరోచోట నిర్మించాలని కొందరు క్రికెట్ ప్రేమికులు మంత్రికి చెప్పడంతో పనులు ఆగినట్టు చర్చ జరుగుతోంది. స్థాయిగల క్రికెట్ మ్యాచులు నిర్వహించాలంటే టర్ఫ్ వికెట్ ఉండాలి. ఇలాంటివి మూడు సిద్ధం చేసిన తర్వాత మైదానంలో టర్ఫ్ గడ్డి పెంచాలి. ఇవి పూర్తయితే ఇతర క్రీడాంశాలను అందులో అనుమతించే వీలుండదు. ప్రత్యేక క్రికెట్ స్టేడియాన్ని మరోచోట నిర్మించాలని అథ్లెటిక్స్ సమాజం సూచిస్తోంది.

ప్రత్యామ్నాయ మార్గాలేమిటి?

జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి గతంలో ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలో ప్రభుత్వం 18 ఎకరాలు కేటాయించింది. అయిదేళ్లకు పైగా స్థలం అథారిటీ చేతిలోనే ఉంది. భవిష్యత్తు అవసరాలకు భారీ స్టేడియం నిర్మించేందుకు స్థలం తీసుకున్నారు. ఖేలో ఇండియా నిధుల కోసం చేసిన ప్రయత్నాలు, పత్రాలు దిల్లీలోనే ఉండిపోయాయి. కాలయాపనతో ఆ స్థలాన్ని ప్రభుత్వం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాలకు కేటాయించింది.

★ చింతకాని మండలం లచ్చగూడెంలో మినీ స్టేడియం నిర్మాణం పూర్తి చేసుకొని ఏళ్లు గడుస్తున్నాయి. క్రీడా అకాడమీలు అలాంటి ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని కొందరు సూచిస్తున్నారు.

రాణిస్తున్న అథ్లెట్స్: షఫీ అహ్మద్, అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి

అథ్లెటిక్స్ అకాడమీ క్రీడాకారులతో పాటు స్థానిక అథ్లెట్లు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఫలితాలు చూసైనా సింథటిక్ ట్రాక్ ఆవశ్యకతను గుర్తించాలి.

క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేసుకుంటాం: చేకూరి వెంకట్, క్రికెట్ సంఘం కార్యదర్శి

స్థలం కేటాయించి క్రికెట్ స్టేడియం కట్టుకోమంటే హెచ్‌సీఏ నిబంధనలు ఒప్పుకోవు. క్రికెట్ స్టేడియం కట్టాల్సి వస్తే ఆ స్థలాన్ని కొనుగోలు చేస్తాం. అందులో నిర్మాణాలు చేపట్టే పద్ధతి అమల్లో ఉంది. క్రికెట్ స్టేడియం అంటే మామూలు విషయం కాదు. స్టేడియం మాకే కావాలని ఎవరినీ కోరలేదు.

సుడా పరిధిలోకి మరిన్ని మండలాలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ(సుడా)ను విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను శుక్రవారం జారీ చేసింది. 2017 అక్టోబర్ 24న ఏడు మండలాలు, 46గ్రామాలతో ఏర్పాటు చేసిన సుడాలో. . ఏడేళ్ల తరువాత అదే రోజున తొమ్మిది మండలాలు, 279 పంచాయతీలను కలపటం విశేషం. రఘునాథపాలెం మండలంలో కొత్తగా పాపడపల్లి, ఈర్లపూడి, మల్లేపల్లి చింతగుర్తి, వేపకుంట్లను కలిపారు. ఖమ్మం గ్రామీణ మండలంలో కొత్తగా కాచిరాజుగూడెం, తనగంపాడు, అరేకోడు, కొండాపురం, తిరుమలాయపాలెం మండలంలో 25 గ్రామాలు, నేలకొండపల్లి మండలంలో 23, ముదిగొండ మండలంలో 19, చింతకాని మండలంలో 10, కొణిజర్ల మండలంలో 11, కల్లూరు మండలంలో 23, పెనుబల్లి మండలంలో 17, సత్తుపల్లి మండలంలో 12, వేంసూరు మండలంలో 14, తల్లాడ మండలంలో 19, వైరా మండలంలో 20, బోనకల్లు మండలంలో 18, మధిర మండలంలో 20, ఎర్రుపాలెం మండలంలో 24 గ్రామాలను కలుపుతున్నట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి.

తహసీల్దారూ.. ఇది కనరూ!




ఖమ్మం అర్బన్ తహసీల్దారు కార్యాలయ ప్రాంగణం దోమల ఉత్పత్తి కేంద్రంగా తయారైంది. ప్రాంగణంలో ప్రధాన భవనం ఎదుట ఉన్న చిన్న ఉద్యానవనంలా మొక్కలను పెంచారు. పట్టించుకోక పిచ్చి చెట్లతో నిండిపోయింది. వర్షాలకు ఇందులోని సంపు నీటితో నిండిపోయింది. చెట్లు ఆకులు ఇందులో పడి నీరు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. శుభ్రం చేయిస్తామని మున్సిపల్ అధికారులు వివరణ ఇచ్చారు. - ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే

ప్చ్.. కబుర్ల కేంద్రమైంది!



కొత్త బస్టాండు అందుబాటులోకి వచ్చాక ఎన్నెస్పీ రోడ్డులో ట్రాఫిక్ గణనీయంగా పెరిగింది. ఇక్కడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని కూడలిలో ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేశారు. నియంత్రించాల్సిన సిబ్బంది జాడ లేకపోవడంతో ఇప్పుడీ కేంద్రం సరదాగా కబుర్లు చెప్పుకొనేందుకు అనువైన ప్రదేశమైంది. కొందరు యువకులు ఈ కేంద్రంలో సరదాగా కబుర్లు చెప్పుకొంటున్న దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది.
ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

నిలిచిన మానవ వ్యర్థాల శుద్ధి



ఇటీవల మున్నేరు వరదల కారణంగా నీరు నిలవడంతో దానవాయిగూడెంలోని మానవ ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రం మూతపడింది. రెండు నెలలుగా అది పని చేయకపోవడంతో వ్యర్థాల తరలింపు నిలిచిపోయింది. ఈ విషయమై కమిషనర్ అభిషేక్ అగస్త్యను 'న్యూస్‌టుడే' సంప్రదించగా త్వరలోనే మరమ్మతులు పూర్తి చేస్తామని, ఇప్పటికే దాన్ని పరిశీలించామని తెలిపారు. - ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించండి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలా నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘంగా అక్టోబరు 31న ఏఐటీయూసీ ఏర్పడిందని, అనేక కార్మిక హక్కులు, సంక్షేమ చట్టాలను సాధించిన ఘనమైన చరిత్ర ఉందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, శివరామకృష్ణ, జాకీరుద్దీన్, రమేశ్ పాల్గొన్నారు.

'దుకాణాల సముదాయం ప్రతిపాదన విరమించుకోండి'

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలం పొందిన సర్దార్ పటేల్ స్టేడియం చుట్టూ దుకాణాల సముదాయం నిర్మించే ప్రతిపాదనను విరమించుకోవాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమలరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిపాదనను విరమించుకోకుంటే అఖిలపక్షాలు, విద్యార్థి సంఘాలతో కలిసి ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

28న నిధి ఆప్‌కే నికట్

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఈ నెల 28న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యోగుల భవిష్యనిధి శాఖ ఉమ్మడి జిల్లా అధికారులు రబిలాల్ దాస్, కె.సునీల్ తెలిపారు. ఖమ్మం నగరంలోని జీవీ మాల్‌లో, కొత్తగూడెంలోని పుర కార్యాలయంలో సేవలు వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

29న హ్యాండ్‌బాల్ ఎంపికలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 29న సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి రఘునందన్ తెలిపారు. 2009 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని, ఆసక్తి గల బాలికలు ఉదయం పది గంటలకు ఆధార్ కార్డుతో రావాలని కోరారు.

ఎండాకు తెగులు పరిశీలన

కూసుమంచి, న్యూస్‌టుడే: ఎర్రగడ్డ తండాతోపాటు పలు గ్రామాల్లో ఎండాకు తెగులు సోకిన వరి పైర్లను కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కె.రవికుమార్, ఏడీఏ సరిత, ఏవో వాణి తదితరులు శుక్రవారం పరిశీలించారు. ఎర్రగడ్డ ప్రాంతంలో ఈ తెగులు ఉద్ధృతితో వందలాది ఎకరాల్లో వరిపైరుకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో అధికారులు పర్యటించారు. తెగులు నివారణకు ఎలాంటి మందులు లేవని చెబుతూ ప్రత్యామ్నాయ చర్యలను వివరించారు.

దేవాలయ దుకాణాల వేలం

కామేపల్లి, న్యూస్‌టుడే: కొత్తలింగాల కోటమైసమ్మ తల్లి దేవాలయం వద్దనున్న దుకాణాల నిర్వహణకు ఈవో శేషయ్య అధ్యక్షతన శుక్రవారం వేలం పాటను నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా సామాగ్రి విక్రయాలను రూ.90 వేలు, కొబ్బరి చిప్పల సేకరణను రూ.10 వేలు, పులిహోర, లడ్డూ విక్రయ పాటను రూ.7 వేలకు దక్కించుకున్నారు.

బొగ్గుగనుల సంప్రదింపుల సంఘం సభ్యుడిగా వద్దిరాజు



ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పార్లమెంటరీ బొగ్గు గనుల శాఖ సంప్రదింపుల సంఘం సభ్యులుగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నియమితులయ్యారు. కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో ఆయనను సభ్యునిగా నియమిస్తూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే పెట్రోలియం సహజవాయువు శాఖపార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులుగా రవిచంద్ర ఉన్నారు.

ఖండన: పెంట్యాల పుల్లయ్య అరెస్టును రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావులు శుక్రవారం వేర్వేరుగా ఓ ప్రకటనలో ఖండించారు. అక్రమ కేసులు ఎత్తివేసి ఆయనను విడుదల చేయాలన్నారు.

నగరంలో సినిమాలు.. శ్రీనివాస: లగ్గం(రెండు ఆటలు), వేట్టయన్(రెండు ఆటలు) శ్రీసాయిరాం: విశ్వం, శ్రీ తిరుమల: దేవర పార్ట్-1, సీఎన్ సినీ గెలాక్సీ: గ్యాంగ్‌స్టర్, వినోద: వేనం-ది లాస్ట్ డాన్స్ కేపీఎస్: పొట్టేల్(రెండు ఆటలు), వేనమ్: ది లాస్ట్ డాన్స్(రెండు ఆటలు)

మండలంలో పర్యటించిన శిక్షణ ఐఏఎస్ అధికారులు

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం మండల కేంద్రాల్లో శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు శుక్రవారం పర్యటించారు. మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలోని వసతులు, వైద్యులు అందించే వైద్యసేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో అత్యధికంగా నమోదయ్యే వ్యాధుల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి ఆసుపత్రిలోని అన్ని గదులను కలియతిరిగారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, తహసీల్దార్ వెంకటరామకృష్ణ, ఏపీఓ నరసింహారావు, వైద్యురాలు కృపాఉషశ్రీ, సత్యసాగర్ పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

పౌరసేవల పరిశీలన..

కామేపల్లి, న్యూస్‌టుడే: కామేపల్లిలోని మండల కార్యాలయాలను సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. ప్రజలకు అందుతున్న పౌరసేవలను వారు స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ నిర్వహణ గురించి వైద్యురాలు డా.చందన వివరించారు. పోలీస్ స్టేషన్‌ను శిక్షణాధికారులు సందర్శించారు. ఎంపీడీవో రవీందర్, ఎస్సై సాయికుమార్, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి, ఏపీఎం సురేంద్రబాబు పాల్గొన్నారు.

'ప్రజా సేవే లక్ష్యంగా జేఐహెచ్'

ఖమ్మం గాంధీచౌక్, న్యూస్‌టుడే: ఏడున్నర దశాబ్దాల నుంచి తమ సంస్థ నిరంతరం ప్రజాసేవలో ఉందని జమాయతే ఇస్లామీ హింద్(జేఐహెచ్) రాష్ట్ర అధ్యక్షుడు డా.ఖలీద్ ముబశ్శిర్ ఉజ్ జఫర్ తెలిపారు. ఖమ్మం నగరంలోని అజీజ్‌గల్లీలోని జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదలు, అనాథలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, తెలంగాణలో జేఐహెచ్ క్లినిక్‌లు, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను సైతం నిర్వహిస్తోందని చెప్పారు. నగరంలో వరద బాధిత బాధితులకు తమ సంస్థ రేషన్ కిట్లు, ఆహార పొట్లాలు, వంట పాత్రలు, ఇతర వస్తువులను సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అధ్యక్షుడు డా.ముబషిర్ అహ్మద్, రాష్ట్ర మాజీ కార్యదర్శి మొహమ్మద్ ఇల్యాస్, జిల్లా అధ్యక్షుడు జైనుల్‌పాషా, సమి, మలిక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖలీద్ ముబశ్శిర్ ఉజ్ జఫర్

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్ దత్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఖమ్మంలోని ఎన్నెస్పీ అతిథి గృహంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సహా జిల్లా అధికారులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం చేరుకున్న ఆయనకు కలెక్టర్, పోలీస్ కమిషనర్, అదనపు కలెక్టర్ డా.శ్రీజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఎన్నెస్పీ అతిథి గృహం ఆవరణలో గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

★ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఖమ్మంలోని ఎన్నెస్పీ అతిథి గృహంలో శుక్రవారం భాజపా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కార్యదర్శి నున్నా రవికుమార్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శాలువా కప్పి స్వాగతించారు. నాయకులు అంజయ్య, శ్యామ్ రాథోడ్, సతీశ్, కృష్ణారావు పాల్గొన్నారు.

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జిల్లా క్రీడా బృందం కలెక్టరేట్ కార్యాలయంలో కలిసి తాము సాధించిన పతకాలు, విజయాలను ఆయనకు వివరించింది. గవర్నర్ క్రీడాకారులను అభినందించారు. డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, శిక్షకులు గౌస్, అక్బర్‌అలీ, క్రీడాకారులు ఉన్నారు.

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఖమ్మం ఐడీఓసీలో పద్మశ్రీ వనజీవి రామయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు ఓ మొక్కను అందజేశారు.

కాగితాలతో కళాకృతులు భళా..!



రంగుల కాగితాలతో బాతులను ఆకృతిని తయారుచేసిన మహిళ

అట్టలు, ఐస్‌క్రీమ్ పుల్లలు, అగ్గిపుల్లలు, జనపనార, పెన్సిల్ చెక్కితే వచ్చే పొట్టు, డ్రైఫ్రూట్ పెంకులు, రంగుల కాగితాలతో కళాకృతులను ఆకట్టుకునేలా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేశారు. గవర్నర్ పర్యటన సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం ఈ కళాకృతులను ప్రదర్శించారు.
– ఈనాడు, ఖమ్మం



పూల కుండీ



అగ్గిపుల్లలతో మహారాజ కుర్చీ

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

కూసుమంచి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన మిషన్ భగీరథ కార్మికుడు, పాలేరుకు చెందిన షేక్ సలీం కుటుంబానికి తోటి కార్మికులు చేయూతనందించారు. పాలేరు సెగ్మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు రూ.55 వేలను సమకూర్చి మృతుని కుమార్తె షేక్ అదీరా అంజుమ్ పేర తపాలా కార్యాలయంలో జమచేశారు. పొదుపు పత్రాలను చిన్నారి, తల్లి రుబీనాకు అందించారు. కార్మికులు కొత్త పుల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీరస్వామి ఏడుకొండలు, మల్సూరు, ఈదయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు ముమ్మరం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని పాదదారులు, కాల్వలను ఆక్రమించి దుకాణాలు, ఇతర సూచికలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు. నగరంలో ఆక్రమణల తొలగింపు ముమ్మరం చేశామని, యజమానులు వారంతటా వారే తొలగించుకుంటే సమస్యలు ఉండవని చెప్పారు. ఇల్లెందు రోడ్డులోని పలు ఆక్రమణలను డీఆర్ఎఫ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

☆ నగరంలోని డంపింగ్‌యార్డులో బయో మైనింగ్ ప్రక్రియ ప్రారంభించిన నేపథ్యంలో ఏడెకరాల భూమి చదునైంది. మియావాకి అటవీ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటే ప్రక్రియను ప్రారంభించారు. 12 నుంచి 15వేల మొక్కలు ఆ ప్రాంతంలో నాటనున్నట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు.

డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: నగదు ఇవ్వాలంటూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను బెదిరిస్తున్న వ్యక్తిపై ఖమ్మం మూడో పట్టణ ఠాణాలో శుక్రవారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రమేశ్ కథనం మేరకు.. తల్లాడ మండలం ముద్దునూరుకు చెందిన కొరకొప్పుల రామారావు అనే వ్యక్తి తాను తెలంగాణ ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం(టీపీటీఎఫ్) నాయకుడినని తిరుగుతున్నారు. తనకు నగదు ఇవ్వాలంటూ హర్కారబావి సెంటర్‌కు చెందిన ఓ పాఠశాల యజమానిని బెదిరించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇప్పటికే రామారావుపై సత్తుపల్లిలో రెండు, కల్లూరులో మూడు కేసులు ఉన్నాయని చెప్పారు.

ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: అప్పు చెల్లించినా బకాయి ఉందంటూ చరవాణికి సందేశం రావడంతో ప్రశ్నించేందుకు వెళ్లిన వ్యక్తిపై ప్రైవేటు ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యం చేసిన ఘటన ఖమ్మం నగరంలో శుక్రవారం జరిగింది. ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో ఓ వ్యక్తి రుణం తీసుకుని చెల్లించారు. ఆయన చరవాణికి ఇంకా రూ.40 వేలు అప్పు ఉందంటూ సందేశం వచ్చింది. అడిగేందుకు కార్యాలయానికి వెళ్లిన ఆయనపై సిబ్బంది దౌర్జన్యం చేశారు. దీనిపై సదరు వ్యక్తి డయల్-100కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఇంజినీరింగ్ విభాగంలో కొత్త సమస్య

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

డిజిటల్ కీ తీసుకోని ఇంజినీర్లు
నిలిచిన ఈ-ఆఫీస్ దస్త్రాలు

ఖమ్మం నగరపాలక సంస్థలో ఇది కీలకమైన ఇంజినీరింగ్ శాఖ.. రూ.కోట్లాది అభివృద్ధి పనులను ఈ విభాగం ద్వారానే చేపడతారు. ఈ తరుణంలో ప్రతిపాదనలతో పాటు, అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల జారీ మొత్తం ఈ ఆఫీస్ ద్వారా నిర్వహించాల్సి ఉంటుంది. అయితే కొంతమంది ఇంజినీర్ల నిర్వాకం నగరపాలకంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో పాటు, చేసిన బిల్లులకు సంబంధించి గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లుల్లో జాప్యం జరుగుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. నగరపాలక సంస్థ పాలకవర్గ పెద్దలకు, ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్య వెళ్లకుండా సదరు అధికారులు జాగ్రత్త పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడం మరో విశేషం.

అసలేం జరిగిందంటే...

నగరపాలక సంస్థలో ప్రతి దరఖాస్తును ఈ ఆఫీస్ ద్వారా పరిశీలించి సంబంధిత విభాగం ఉన్నతాధికారులకు అనుమతుల నిమిత్తం పంపుతుంటారు. వాటిని ఇంజినీర్లు పరిశీలించే సమయంలో లోపాలు ఉంటే వాటిని సరి చేసుకోవాలని దరఖాస్తుదారులకు సూచించి వెనక్కు పంపుతారు. అయితే ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఒకరిద్దరు ఇంజినీర్లు ఇప్పటి వరకు తమ పేరిట డిజిటల్ 'కీ'లను తీసుకోకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని కొంతమంది అధికారులు, గుత్తేదారులు వాపోతున్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం

ఈ-ఆఫీస్ ద్వారా కార్యాకలాపాలు నిర్వహించకపోవడంతో గుత్తేదారులకు చెల్లించాల్సిన రూ.లక్షలాది బిల్లుల చెల్లింపు ప్రక్రియ నిలిచిపోయిందని వారు వాపోతున్నారు. తాము డిజిటల్ కీ తీసుకోకుండా అది ఉన్న ఇంజినీర్ల ద్వారా వాటిని పంపేందుకు ప్రయత్నించినప్పటికీ కొన్ని సమయాల్లో తమకు సమస్యలొస్తాయన్న భయంతో వారు అంగీకరించడం లేదు. దీంతో ఆయా సమస్యలు మరింత జటిలమవుతున్నాయని గుత్తేదారులు పేర్కొంటున్నారు.

ఇక్కడ నుంచి వెళ్లిపోతాం.. అందుకే...

తాము నగరపాలకంలో పని చేయమని, త్వరలోనే తాము ఇక్కడి నుంచి వెళ్లిపోతామని అందువల్లే డిజిటల్ 'కీ'లు తీసుకోవడం లేదని సదరు ఇంజినీర్లు పేర్కొన్నట్టు తెలుస్తోంది. అప్పటి వరకు బిల్లుల చెల్లింపు, పనుల మంజూరు దరఖాస్తులను ఎలా చేస్తారని ప్రశ్నిస్తే ఏదో ఒకటి చేస్తామని చెప్పి తప్పించుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఈఈ కృష్ణలాల్‌ను సంప్రదించగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.